తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గర్షం నారరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
13 డిసెంబర్ 2024
సంపుటి : 02
సంచిక : 176
పేజీలు : 12
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna





## సీఎం రేవంత్ సీరియస్

- జైలులో గుండెపోటుకు గురయిన లగచర్ల రైతు
- బేడీలతోనే లగచర్ల రైతు ఆస్పత్రికి తరలింపు
- తెలంగాణ పోలీసులు మరో దారుణం
- ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ
- ఘటనపై పోలీసులపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరిక

హైదరాబాద్,తరంగాలు

తెలంగాణలో లగచర్ల రైతుల పోరాటం తీవ్ర రాజకీయ పరిణామాలకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే అధికారులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ గ్రామ రైతులను అరెస్ట్ చేసి జైలులో ఉంచిన విషయం తెలిసిందే. వారికి సంబంధించి కేసు విచారణలో ఉంది. అయితే దాడి నెపంతో -మిగతా 3 లో



## కోర్టులో మతపరమైన పిటిషన్ల నిరాకరణ

- మతపరమైన స్థలాలపై వ్యాజ్యాలను స్వీకరించకూడదు
- పెండింగ్ కేసులపైనా తీర్పులు ఇవ్వొద్దు!
- దిగువ న్యాయస్థానాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ,తరంగాలు

దేశ వ్యాప్తంగా పలుచోట్ల వివిధ ప్రార్థనా స్థలాల్లో నిర్వహిస్తున్న సర్వేలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్న తరుణంలో సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను -మిగతా 3 లో




## ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

- డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా నిలుపుదల
- డిసెంబర్ 16వరకు సేవలకు అంతరాయం
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, తరంగాలు

ధరణి పోర్టల్ సేవలకు సంబంధించి తెలంగాణ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 16వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో పేర్కొంది. డేటాబేస్ వెర్షన్ అప్ గ్రేడ్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 16వ తేదీ ఉదయం వరకు అప్ గ్రేడ్ ప్రక్రియ ముగిసే అవకాశం -మిగతా 3 లో




## వన్ నేషన్ వన్ ఎలక్షన్

- జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పార్లమెంట్‌లో బిల్లు పెట్టేందుకు సిద్ధమైన కేంద్రం

న్యూఢిల్లీ,

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ -మిగతా 3 లో

## లగచర్ల రైతులకు అండగా ఉంటాం



- రైతుకు బేడీలు వేయడం అమానవీయం
- రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనం
- గవర్నర్ కూడా అంశంపై విచారణకు ఆదేశించాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, తరంగాలు

గుండెపోటుకు గురయిన లగచర్ల గిరిజన రైతు హీర్యా నాయక్‌కు బేడీలు వేయడం అమానవీయం, రేవంత్ క్రూర మనసత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. జైలులో ఉన్న రైతు బిడ్డ హీర్యా నాయక్‌కు నిన్న గుండెల్లో నొప్పి వస్తే.. వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని -మిగతా 3 లో



## సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్
ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చ

హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. -మిగతా 3 లో



## పిన్నవయస్సులో ఛాంపియన్‌గా అవతరించిన గుకేశ్

- 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారతీయుడు
- గుకేశ్‌కు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు
- మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్
- గుకేశ్ పేరు సుస్థిరంగా నిలుస్తుందన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,తరంగాలు

భారత యువ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. చివరిదైన 14వ గేమ్‌లో చైనాకు చెందిన లిరెన్‌ను ఓడించిన గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నాడు. అత్యంత చిన్న వయసులో -మిగతా 3 లో

## పొరపాట్లకు తావులేకుండా సర్వే

- ఈనెల 31లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఈఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నాం
- సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం
- కలెక్టర్‌లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్
- మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ
- ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం వేగంగా అడుగులు
- దరఖాస్తుల పరిశీలనకు డెడ్‌లైన్ విధింపు

హైదరాబాద్,తరంగాలు

ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల పరిశీలనకు -మిగతా 3 లో



తరంగాలు Tharangalu Daily News Paper

# సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన


-పలువురు కేంద్రమంత్రులతో భేటీ
-కేంద్రమంత్రి కిషన్? రెడ్డితో సీఎం భేటీ
-రాహుల్? గాంధీతో భేటీ అయ్యే అవకాశం



**న్యూఢిల్లీ,తరంగాలు**
సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్? రెడ్డితో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?ను కూడా రేవంత్ రెడ్డి కలిశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్? పార్టీ అగ్రనేత రాహుల్? గాంధీతో పాటు సీనియర్? నేతలను కూడా ఆయన కలిసే అవకాశం ఉంది. పీసీసీ కార్యవర్గం ఎంపిక, మంత్రివర్గ విస్తరణ అంశాలపై అధిష్ఠానంతో చర్చించే ఛాన్స్ ఉంది. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్? ఎంపీలతో ఇవాళ రాత్రి రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి పార్లమెంట్?లో ప్రస్తావించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది.


# ఛతీస్ఘఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

12మంది మావోయిస్టులు మృతి



**బస్తర్, తరంగాలు**
ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

# రాజమండ్రి నుంచి ఢిల్లీకి విమానసర్వీసులు



**అమరావతి,తరంగాలు**
ఏపీలోని రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీ, ముంబాయి విమాన సర్వీస్ గురువారం నుంచి ప్రారంభమయ్యింది. ఢిల్లీ నుంచి రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్టుకు మొదటిసారిగా వచ్చిన ఇండిగో ఎయిర్ బస్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి రాజమండ్రికి వచ్చారు. ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనాన్లతో సిబ్బందితో స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇంతకుముందు ఢిల్లీకి, విదేశాలకు వెళ్లాలంటే విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌కు వెళ్లాల్సివచ్చేదని అన్నారు. ఇకపై ముంబాయి, ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విదేశాలకు వెళ్లవచ్చని తెలిపారు. కాకినాడు ఎయిర్‌పోర్టు విషయంలో ల్యాండ్‌తో సహా ఫిజిబిల్టిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ తిరుపతి, షిర్డీ, జైపూర్, గుజరాత్ రాష్ట్రాలకు, ప్రధాన నగరాలకు బిజినెస్ కనెక్టివిటీని పెంచడానికి అవకాశముందని అన్నారు. 2027లో రాజమండ్రి పుష్కరాలకు కూడా విమానశ్రయాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

# మోదీ నాయకత్వంలో భారత్ లో గణనీయమైన పురోగతి

-ప్రపంచంలో అత్యంత వేగంగా భారత్ అభివృద్ధి
-డిజిటల్ ఆవిష్కరణలతో అత్యంత పురోగతి
-సాంకేతికత, మౌలిక సదుపాయాలు,
-భారత ప్రధానిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



**న్యూఢిల్లీ,తరంగాలు**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో.. భారతదేశం సాంకేతికత, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆవిష్కరణలతో సహా అనేక రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా.. భారత్ తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది.. దీనంతటికీ.. మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు కారణమని.. అందుకే భారత్ ప్రపంచంలోని శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా నిలుస్తుందంటూ పలువురు విదేశీ నేతలు ప్రశంసలు కురిపిస్తున్నారు.. ఇదే విషయాన్ని స్వయంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ .. పలు వేదికలపై మాట్లాడటం ఆసక్తి రేపుతోంది.. ఇటీవల రష్యాలో జరిగిన కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం.. దార్శనికతను ప్రశంసించారు.. ఆయన మార్గదర్శకత్వంలో భారతదేశం తీసుకున్న ముఖ్యమైన అభివృద్ధి చర్యలను హైలైట్ చేయడంతోపాటు.. అదంతా మోదీ క్రెడిట్ అంటూ పేర్కొన్నారు.. తాను పిఎం మోదీ తరచూ మాట్లాడుతానని పేర్కొన్న పుతిన్.. 'మేక్ ఇన్ ఇండియా', ఆత్మ నిర్భర్ భారత్ వంటి ప్రధాని కార్యక్రమాల పట్ల ప్రశంసలు కురిపించారు.. దేశ అభివృద్ధికి అతని ముందున్న ఆలోచనా విధానాన్ని అభినందించారు. భారతదేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి చెందిన భవిష్యత్తు వైపు నడిపించడంలో ప్రధాని మోదీ అంకితభావాన్ని నొక్కిచెప్పిన రష్యా అధ్యక్షుడు పుతిన్.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు.. యాదృచ్ఛికంగా, తను ప్రధానమంత్రి మోడీతో తరచుగా సంప్రదింపులు జరుపుతానని.. మేము అనేక విషయాలపై మాట్లాడుకుంటామని తెలిపారు.. వాస్తవానికి, మేక్ ఇన్ ఇండియా.. ఆయన చొరవ గొప్పది%ౌ% అంటూ పేర్కొన్నారు. మోదీ భవిష్యత్తును చూసే వ్యక్తి.. మేము అతనితో ఈ అవకాశాల గురించి ఎల్లప్పుడూ మాట్లాడుతాము.. అలా ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం అంటూ పేర్కొన్నారు. ప్రపంచంలో భారతదేశం అద్భుతమైన వృద్ధిని గుర్తిస్తూ.. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలను కూడా రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. "భారత్‌ను ఈ అభివృద్ధి వైపు, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించే దిశగా ప్రధాని ఎల్లవేళలా కృషి చేస్తున్నారు.. ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అంటూ పేర్కొన్నారు.

"అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం అత్యధిక వృద్ధి రేటును ప్రదర్శిస్తోంది.. ఇది మిమ్మల్ని అభినందించాల్సిన విషయం" అని పుతిన్ నొక్కిచెప్పారు.. ఆర్థిక విస్తరణ, సాంకేతిక ఆవిష్కరణలను నడపడంలో భారతదేశం సాధించిన విజయాన్ని ఎత్తిచూపారు. భారతదేశం డైనమిక్ గ్రోత్ మరియు హైటెక్ పరిశ్రమలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించడం కోసం ఎక్కువగా గుర్తింపు పొందుతున్న తరుణంలో రష్యా అధ్యక్షుడి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అదనంగా, పుతిన్ నుంచి ఈ ప్రశంసలు రష్యా %-% భారతదేశం మధ్య పెరుగుతున్న ద్వైపాక్షిక బలాన్ని కూడా నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా, 2014లో ప్రధాని మోదీ ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం.. భారత్‌ను గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా, ఈ చొరవ భారతదేశాన్ని స్వయం-ఆధారిత దేశంగా (ఆత్మనిర్భర్ భారత్) మార్చడంపై దృష్టి సారించింది.. చివరికి దేశం ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా పెంచడంతోపాటు గణనీయమైన వృద్ధిని సాధించింది..

# ప్లాన్ ఏలా చేయాలని చూపించటానికే భిక్షగాడి హత్య

-ఓంకార్ అకృత్యాలు వెలుగులోకి...

**అమరావతి, తరంగాలు**
తాను బెదిరించి లొంగదీసుకున్న మహిళతో ఆమె భర్తను హత్య చేయించేందుకు ఓ వైసీపీ నేత అమాయకుడైన ఓ బిక్షగాడిని హత్య చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన ఆ పార్టీ నేత దేవరకొండ నాగేశ్వరరావు అలియాస్ ఓంకార్ సాగించిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతని ఆరాచకాలపై బాధిత కుటుంబం ఈ నెల 2న గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితులు ఫిర్యాదుతో నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఓ కేసు, మహిళా పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదు చేశారు. ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తర్వాత కేసులైతే నమోదు చేశారు గానీ ఇంతవరకు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. ఇప్పటికీ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధిత కుటుంబం నిర్వహించే దుకాణం వద్ద, ఇంటి సమీపంలో రెకీ నిర్వహిస్తుండటంతో ఆ కుటుంబం హడలిపోతోంది.



బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో దుకాణం నిర్వాహకురాలిని లొంగదీసుకునేందుకుగానూ నిందితుడు నాగేశ్వరరావు తన అనుచరులతో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడు. బాధిత మహిళ నగరంపాలెం స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఓ మహిళను లొంగదీసుని వారు ఏకాంతంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకొని ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఆమె ద్వారానే ఆమె భర్తను హత్య చేయించేందుకు ఆ వైసీపీ నేత కుట్ర పన్నాడు. ఇందుకు గానూ ఓ బిక్షగాడిని కడతేర్చాడు. భర్తను చంపకపోతే ఆమెను, ఆమె పిల్లల్ని చంపేస్తానంటూ బెదిరించాడు. ఎవరికి అనుమానం రాకుండా, చేతికి మట్టి అంటకుండా ఎలా చంపాలి అనేది ఆమెకు తెలియజెప్పడానికి ఏకంగా ఓ బిక్షగాడిని సైనెడ్ ఇచ్చి చంపేసినట్లు బాధిత మహిళ ఆరోపిస్తుంది. చిలకలూరిపేట వెళ్లే జాతీయ రహదారిపై కాటూరి మెడికల్ కళాశాల సమీపంలోని సర్వీసు రోడ్డులో ఓ బిక్షగాడు గోనె పట్టాలతో దేరా కట్టుకొని నివాసం ఉండేవాడు. దారిన వచ్చి పోయేవారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునేవాడు. అయితే వైసీపీ నేత నాగేశ్వరరావు ఓ బంగారు షాపులో పనిచేసే వ్యక్తి వద్ద నుంచి సైనెడ్ తెప్పించి బిక్షగాడికి నీటిలో కలిపి తాగించాడు. దీంతో అతను చనిపోయాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని తన సెల్ ఫోన్లో వీడియో తీసి ఆమెకు చూపించాడు. ఇదే విధంగా ఆమె భర్తను చంపాలని ఆమెను బెదిరించాడు.

# సిరియాపై ఇజ్రాయిల్ విధ్వంసకాండ

- 350కిపైగా వైమానిక దాడులు
- సిరియా నేవీ విధ్వంసం
- దేశం లోపలకు చొచ్చుకుపోయిన ఇజ్రాయిల్ బలగాలు

**దమాస్కస్ :** సిరియా వ్యాప్తంగా ఇజ్రాయిల్ భారీగా విధ్వంసానికి తెగబడుతోంది. సిరియా భూభాగం లోపలకు ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకుపోయాయని సిరియా ప్రతిపక్ష యుద్ధ పర్యవేక్షక సంస్థ తెలిపింది. సిరియా నావికాదళాన్ని మొత్తంగా నాశనం చేశామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించారు. దక్షిణ సిరియాలో నిస్సైనికీకరణ మండలాన్ని ఏర్పాటు చేస్తామని రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ పేర్కొన్నారు. సిరియాలో తీవ్రవాదం వేళ్ళూనుకోకుండా నివారించేందుకే ఈ చర్యలని చెప్పారు. అసద్ పంథాను ఎవరు అనుసరించినా వారికి అసద్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అసద్‌ను పదవీచ్యుతుడిని చేసిన తర్వాత బఫర్ జోన్‌లోకి



ప్రవేశించామని ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆ ప్రాంతాన్ని దాటి ఇంకా ముందుకెళ్లాయా లేదా అనేది స్పష్టంగా తెలియరాలేదు. ఈ బఫర్ జోన్‌ను 50ఏళ్ళ క్రితం ఏర్పాటు చేశారు. అయితే రాజధాని దమాస్కస్ లోపలకు చొచ్చుకు వెళ్ళామనడాన్ని ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. గత 48గంటల్లో 350కి పైగా వైమానిక దాడులకు పాల్పడ్డామని మిలటరీ ప్రకటించింది. దేశంలోని వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేసేశామని తెలిపింది. తీవ్రవాదుల చేతుల్లోకి ఆ ఆయుధాలు వెళ్ళకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ దాడులు జరిపామంటూ సమర్ధించుకుంది. సిరియా నావికాదళానికి చెందిన రెండు నౌకాశ్రయాలపై ఒకేసారి క్షిపణి నౌకలతో దాడి చేశామని మిలటరీ తెలిపింది. అక్కడ మొత్తంగా 15నౌకలు వున్నాయని పేర్కొంది. అయితే వాటిల్లో ఎన్ని నౌకలపై దాడి చేశామన్నది వివరించలేదు. సోవియట్ శకానికి చెందిన ఆరు క్షిపణి నౌకలు దాడికి గురయ్యాయని ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ అంబ్రే వెల్లడించింది. కాగా ప్రస్తుతం సిరియాలో ఎక్కువ భాగాన్ని నియంత్రిస్తున్న హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) నేతృత్వంలోని తీవ్రవాద గ్రూపుల నుండి ఎలాంటి స్పందన వెలువడలేదు. రెబెల్ అలయన్స్ ఏర్పాటు చేసే సాల్వేషన్ గవర్నమెంట్‌కు నాయకత్వం వహించే మహ్మద్ అల్ బషీర్ సారధ్యంలోని కొత్త కేబినెట్‌కు పాత ప్రభుత్వ సభ్యులు క్రమంగా అధి కారాలను బదిలీ చేస్తారు. మార్చి ప్రారంభం వరకు ఈ బదిలీ కొనసాగుతుందని బషీర్ విలేకర్లకు చెప్పారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI. TELTEL / 2022 / 83463 Tharangalu Daily News Paper

# సీఎం రేవంత్ సీరియస్

(మొదటి తరువాయి)

అమాయక రైతులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికే లగచర్లలో బీభత్సం సృష్టించిన పోలీసులు తాజాగా మరో దారుణానికి పాల్పడ్డారు. అనారోగ్యానికి గురయిన లగచర్ల రైతును బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం సంచలనంగా మారింది. పోలీసుల చర్య రాజకీయ దుమారం రేపింది. ఆ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రతిపక్షాలు మండిపడుతుండడంతో ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలోని రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటుపై తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సమయంలో అధికారులను ఘెరావ్ చేశారు. అధికారులపై దాడికి పాల్పడ్డారనే కారణంతో అమాయక రైతులను అరెస్ట్ చేశారు. కొందరు సంగారెడ్డి రెడ్డి జైలులో ఉండగా.. మరికొందరు ఇతర జైళ్లల్లో ఉన్నారు. తాజాగా అరెస్టయిన రైతుల్లో ఇద్దరు అనారోగ్యానికి



గురయ్యారు. సంగారెడ్డి జైల్లో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండె నొప్పి వస్తే ఆ సమాచారం బయటకు రాకుండానివ్వకుండా ఆస్పత్రికి తరలించారు. లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సీఎం ఆరా తీశారని సమాచారం. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులను నిలదీసినట్లు తెలుస్తోంది. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని హెచ్చరించారని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఈ సంఘటనను ఖండించారు.

# వన్ నేషన్ వన్ ఎలక్షన్

(మొదటి తరువాయి)

సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లూ పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది.

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!

(మొదటి తరువాయి)

ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్‌గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

# లగచర్ల రైతులకు అండగా ఉంటాం

(మొదటి తరువాయి)

కుటుంబసభ్యులకు చెప్పకుండా, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఆస్పత్రికి తరలించకుండా.. చికిత్స అందించకుండా అమానవీయంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ గుండెపోటుకు గురవగా అతడిని బేడీలతోనే ఆస్పత్రికి తరలించడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ఖండిస్తూ హైదరాబాద్‌లోని నంది నగర్‌లో ఉన్న తన నివాసంలో కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తోందని.. బేడీలు వేసి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. 'హీర్యా నాయక్‌తోపాటు లగచర్ల రైతులు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం బాగాలేదని.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు. రైతుబిడ్డకు బేడీలు వేసి అన్యాయంగా.. అమానవీయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువచ్చింది. స్ట్రెచర్‌పై.. అంబులెన్స్‌లో తీసుకురావాల్సిన మనిషిని బేడీలు వేసి తీసుకువచ్చారు. ఇంతటి దుర్మార్గమైన అమానవీయమైన ప్రవర్తన క్షమార్హం కాదు' అని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'ఇలా చేయడం రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే. కొత్త క్రిమినల్ చట్టం బీఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా.. పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రావెల్స్ ఖైదీల హక్కులను హరించడమే' అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలి. గవర్నర్ కూడా ఈ అంశంపై విచారణకు ఆదేశించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'రైతులను వేధిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం జైపూర్‌లో విందులు.. వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కానీ తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి హృదయం ఉంటే గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే కేసులు రద్దు చేయాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 'మేము చెప్పిందే నడవాలని అహంకారంతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులు గిరిజన రైతన్నల ప్రాణాలు తీస్తున్నారు' అని ఆరోపించారు. 'నా మాట వినలేదు అనే ఏకైక కారణంతోనే లగచర్ల రైతులపై రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు' ని తెలిపారు. బేషజాలకు పోకుండా గిరిజన రైతులపై అక్రమ కేసులను వెనక్కి తీసుకొని జైలు నుంచి విడిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. 'రేవంత్ రెడ్డి మాత్రం కక్షపూరితంగా రైతులపై కేసులు పెట్టించారు. ఆయన అహంకారం దెబ్బతిన్నదని, ప్రతిష్టకు తీసుకొని అదే రోజు 17 మంది రైతన్నలను అరెస్ట్ చేయించారు' అని గుర్తుచేశారు. అదుపులోకి తీసుకున్న రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ టార్చర్ చేశారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

## కోర్టులో మతపరమైన పిటిషన్ల నిరాకరణ

(మొదటి తరువాయి)

తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని, అలాగే ఎలాంటి ఆదేశాలు జారీ చేయరాదని స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాల చట్టం-1991కి సంబంధించి అనుకూలంగా, ప్రతికూలంగా దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఆయనతోపాటు వివిధ పార్టీల నాయకులు జితేంద్ర అహ్వాద్, శరద్‌పవార్, మనోజ్ కుమార్ ఝా తదితరులు కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. కేంద్రం ప్రతిస్పందన తర్వాత ఇతర పార్టీలు రీజాయిండర్ దాఖలు చేయటానికి మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఆ తర్వాతే ఈ విషయంపై విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ అంశానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల్లోనూ ఎలాంటి తీర్పులు, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని అన్ని జిల్లా కోర్టులు, హైకోర్టులను దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ సందర్భంగా జ్ఞానవాపి, మధుర షాహీ ఈద్గా, సంభల్ మసీదు అంశాలను ప్రస్తావించింది. కేంద్రం తన స్పందనను తెలియజేసే వరకు ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఏదైనా ప్రార్థనా స్థలాన్ని మార్చటాన్ని నిషేధిస్తుంది. అయితే 1947 ఆగస్టు 15న ఉన్న ఏ ప్రార్థనా స్థలం ఏదైనా అలాగే కొనసాగేందుకు అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రార్థనా స్థలాల చట్టం 1991ని పరిశీలిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే విచారణ చేయకుండా ఆదేశాలు జారీ చేయరాదంటూ ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను హిందువుల తరఫున న్యాయవాదులు వ్యతిరేకించారు.

## పిన్నవయస్సులో ఛాంపియన్‌గా అవతరించిన గుకేశ్

(మొదటి తరువాయి)

18 ఏళ్లకే గుకేశ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్ 3, లిరెన్ 2 గేమ్‌లో విజయం సాధించారు. తొమ్మిది గేమ్‌లు డ్రా అయ్యాయి. ఈ క్షణం కోసం తాను పదేళ్లుగా కలలు కన్నానని గుకేశ్ అన్నాడు. తన కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నాడు. ఈ విజయాన్ని తాను ఊహించలేదని, ఈ ఘనత సాధించగానే భావోద్వేగానికి లోనయ్యానన్నాడు. తన దృష్టిలో లిరెన్ నిజమైన ప్రపంచ ఛాంపియన్ అని పేర్కొన్నాడు. లిరెన్‌కు అతను ధన్యవాదాలు తెలిపాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన గుకేశ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదికగా వారు ట్వీట్ చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలిచిన అతి పిన్న వయస్కుడిగా నిలిచినందుకు గుకేశ్‌కు హృదయపూర్వక అభినందనలు... మన దేశం గర్వపడేలా చేశారంటూ రాష్ట్రపతి ట్వీట్ చేశారు. గుకేశ్ విజయం చారిత్రాత్మకమైనది... ఎంతోమంది యువతకు ప్రేరణనిచ్చేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గుకేశ్ అద్భుతమైన విజయం సాధించారని ప్రశంసించారు. అతడి అసమాన ప్రతిభ, కృషి, సంకల్పాల ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు. ఈ విజయం చెస్ చరిత్రలో గుకేశ్ పేరును సుస్థిరం చేయడమే కాకుండా లక్షలాది మంది యువతకు గొప్ప కలలు కనేందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కాగా, చెస్‌కు, భారత్‌కు, డబ్ల్యుసీఏకు, తనకూ ఇది గర్వించదగ్గ విషయమని విశ్వనాథన్ ఆనంద్ పేర్కొన్నారు.

# ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

(మొదటి తరువాయి)

ఉంటుందని వివరించింది. ధరణి పోర్టల్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై ఇటీవలే మీడియాతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. కీలక విషయాలను వెల్లడించారు. నిపుణుల కమిటీ రిపోర్టు ఆధారంగా ధరణి పోర్టల్ ను ఎలా ప్రక్షాళన చేయాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరిగేలా ధరణి పోర్టల్ లో మార్పులు చేస్తామని చెప్పుకొచ్చారు. 2020 ఆర్‌వోఆర్ చట్టంలో లోపాలు సరిచేసి 2024 ఆర్‌వోఆర్ చట్టం తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదిస్తామన్నారు. ధరణి కొత్త యాప్, కొత్త చట్టం సామాన్యులకు చాలా ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రాత్రికి రాత్రే రద్దు చేసిందన్నారు. అయితే రెవెన్యూ గ్రామాలకు ఒక అధికారి ఉండాలనేది స్థానికులు అభిప్రాయం అన్నారు. భూముల నిర్వహణకు సంబంధించి తెలంగాణలో కొత్త చట్టం రాబోతుంది. ఇప్పటికే 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్ బిల్-2024' ముసాయిదాను కూడా ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఇప్పుడు జరగబోయే% .అసెంబ్లీ సమావేశాల్లో ఆర్వోఆర్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈ ముసాయిదా బిల్లు పేర్కొన్న వివరాల ప్రకారం .. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూదార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు.

## పొరపాట్లకు తావులేకుండా సర్వే

(మొదటి తరువాయి)

డెడ్‌లైన్ విధించిన మంత్రి.. పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, సామాజిక సర్వే తదితర అంశాలపై సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి. ఈకార్యక్రమంలో సీఎం సలహాదారు, సీఎస్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాక పోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ముందు రోజు రాత్రే ప్రజలకు సమచారం ఇవ్వాలని.. స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. దరఖాస్తూల విషయంలో పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు.

## సంపాదకీయం

# ఆ నలుగురైనా మిగులుతారా!?

జగన్మోహన్‌రెడ్డి జమానాలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటీ బయటపడుతుంటే దిగ్భ్రాంతి కలుగుతోంది. ఎన్నికల్లో జగన్ అలవిగాని హామీలు ఇచ్చి, వాటిని నెరవేర్చడానికి ఎక్కడెక్కడి నిధులూ మళ్లించి, అభివృద్ధిని గాలికి వదిలేశారనే ఇంతదాకా చాలా మంది నమ్ముతూ వచ్చారు. అయితే ఐదేళ్లూ జరిగింది నిధుల మళ్లింపు కాదు, నిధుల దోపిడీ అని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల్లో గెలవడం కోసం ఖజానా శక్తికి మించి, ప్రజల వాస్తవ అవసరాలకు మించి వాగ్దానాలు ఇచ్చేయడం రాజకీయాల్లో దశాబ్దాల కిందటే మొదలైంది. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీలతో జాతీయ పార్టీలు కూడా పోటీపడుతున్నాయి. అలివిగాని హామీలు ఇచ్చినవారు, గెలిచాక వాటి అమలుకు తంటాలు పడుతుంటారు. ప్రభుత్వ పాలనకు ఇవి కొరకరాని కొయ్యలుగా మారిన వైనాన్ని జగన్ పాలనలో స్పష్టంగా చూశాం. నిజానికి వీటి ముసుగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వనరుల దోపిడీ విపరీతంగా జరిగింది. సన్నబియ్యం ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పి, ముతకబియ్యమే ఇచ్చినా జనం ఆగ్రహించలేదు కానీ, ఆ ముతకబియ్యాన్ని కూడా పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేసిన తీరు చూసి మాత్రం ముక్కున వేలేసుకుంటున్నారు. జగన్‌కి అత్యంత సన్నిహితుడి సారథ్యంలోనే కాకినాడ పోర్టు నుంచి ఈ తంతు జరిగిందని వెల్లడి కావడంతో రాష్ట్రం పరువు బంగాళాఖాతంలో కలిసిపోయింది. పోర్టులను లాగేసుకోవడం, తన వాళ్లకు అప్పగించేయడం, అడ్డంగా కరెంటు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం, బలవంతపు భూ ఆక్రమణలు, రాజధాని పేరుతో విశాఖలో సాగించిన దందాలు, మద్యం మోసం, ఇసుక మాఫియా.. ఇవన్నీ చూస్తుంటే%-% ఇట్లా కూడా పాలన చేయవచ్చా అనే ఆశ్చర్యం కలుగుతుంది. అబద్ధాన్ని దబాయించి నిజమని చెప్పే తీరు చూస్తుంటే, రాష్ట్ర భవిష్యత్తు పట్ల భయమేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో అద్భుతం జరుగుతుందనే ఆశతోనే అన్ని సామాజికవర్గాలూ కలిసి 2019లో జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాయి. ఆయన మాత్రం ఒక్కటే సామాజికవర్గాన్ని నెత్తిన పెట్టుకున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ అదే సామాజికవర్గానికి చెందిన నలుగురి మీదే నమ్మకం పెట్టుకున్నారు. రాష్ట్రం నాలుగు దిక్కులా ఆ నలుగురికీ పగ్గాలిచ్చి దోపిడీకి ద్వారాలు తెరిచేశారు. విశాఖ కేంద్రంగా ఒకరూ, గోదావరి జిల్లాల మీదకు ఒకరూ, దక్షిణాంధ్రలో ఒకరూ, రాయలసీమలో మరొకరూ దోపిడీ ప్రతినిధులుగా వ్యవహరించారు. వారి అధికార దర్పానికీ, నోటికీ, చర్యలకూ అడ్డూ అదుపూ లేకుండాపోయింది. విచిత్రం ఏమిటంటే.. జగన్ ఇచ్చిన అపరిమిత అధికార పగ్గాలతో ఎడాపెడా చెలరేగిపోయిన ఈ నలుగురూ%-% రాష్ట్రంలో పాత కుంభకోణాల పుట్ట పగులుతూ ఉన్న ఈ సమయంలో మొహం చాటేస్తున్నారు. మీడియా ముందుకు కూడా పెద్దగా రావడం లేదు. పార్టీకీ, జగన్‌కీ రక్షాకవచంగా నిలబడడం లేదు. 'కాటికి పోయేప్పుడైనా నలుగురు ఉండాలి' అని తెలుగునాట ఒక సామెత ఉంది. కనీసం నలుగురినైనా నమ్మకంగా నిలుపుకోవాలని దాని ఉద్దేశ్యం. పాపం.. జగన్ పాపాల భారాన్ని మోయడానికి ఆ నలుగురూ కూడా మిగిలేట్టుగా కనిపించడం లేదు. భారతదేశపు రాజకీయాల్లోనే జగన్ మాట, ప్రవర్తన, వ్యవహారశైలి, పాలన.. సామాజిక, రాజకీయ, మనస్తత్వ శాస్త్రాల్లో ఒక కేస్ స్టడీ అవుతుంది. తొలినాళ్లలో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జపం చేసిన ఆయన, ఆ తర్వాత దానిని వదిలేశారు. తండ్రికి నమ్మకస్తులైన నేతలు ఎవరినీ జగన్ చేరదీయలేదు. అవసర కాలంలో అమ్మనీ, చెల్లినీ రాజకీయ పావులుగా ఉపయోగించుకుని, అవసరం తీరాక దూరం పెట్టేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను తొలుత 'అన్నా' అని సంబోధించి, ఆ తర్వాత వారితో జగన్ వ్యవహరించిన తీరు అందరూ గమనించారు. వైసీపీ అంటే జగన్ మాత్రమే అన్నట్టుగా అధికారంలో ఉన్నపుడు ప్రవర్తించిన ఆయన తీరు, ఇప్పుడూ మారలేదు. అభివృద్ధిని అటకెక్కించి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన ఇటువంటి నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే పాఠాన్ని రాష్ట్ర ప్రజలు నేర్చుకున్నారు. కేవలం కొల్లగొట్టుకోవడం అనే ఒకే ఒక్క కార్యాచరణతో ఐదేళ్లూ జగన్ పాలన సాగింది. ఇక జగన్‌ను తిట్టుకుంటూ కాలం గడపలేం. ధ్వంసమైన వ్యవస్థలకు మళ్లీ భరోసా ఇచ్చి నిలబెట్టాలి. విభజనతో బలహీనపడిన ఒక చిన్న రాష్ట్రం, తిరిగి కోలుకోవడానికి కావలసింది ఆర్థిక శక్తి. సహజ వనరులను సక్రమంగా వినియోగంలోకి తెచ్చుకుని, పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చి సంపద సృష్టి జరగాలి. ఈ సవాలు సులువైనదేమీ కాదు. అయినా కూటమి పాలనలో రాష్ట్ర ప్రజల్లో ఒక ఆశ, నమ్మకం కలుగుతున్నాయి. చంద్రబాబు విజన్, కార్యదక్షత, అనుభవం, కసితో కూడుకున్న పట్టుదల.. ఇందుకు కారణం. కూటమి నాయకుల సమష్టి కృషి వల్ల మాత్రమే రాష్ట్రం నిలదొక్కుకుని నెగ్గుకు రాగలదు. జాతీయ రాజకీయాల్లో సంఖ్యాపరంగా శాసించే స్థానంలో ఉన్నా, రాష్ట్ర అభివృద్ధికి కావలసిన వనరులు సాధించుకోవడం మీదే చంద్రబాబు దృష్టి పెట్టారని అర్థమవుతోంది. సంయమనంతో, లౌక్యంతో చంద్రబాబు సాధించగలరు. కనీసం ప్రతిపక్ష నేతగా అయినా జగన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. తాను సీఎంగా ఉంటే ఇంతకన్నా మెరుగ్గా ఏమి చేయగలనో ప్రజలకు వివరించి, వారి మనసులు జగన్ గెలుచుకోవాలి గానీ, చంద్రబాబు పాలనలో ప్రతిదీ తప్పేనంటూ తన సొంత మీడియాలో అచ్చేసి వదలడమే పనిగా పెట్టుకుంటే జనం మొదట నవ్వుకుంటారు. ఆ తర్వాత చిరాకుపడతారు. చివరికి ఆయన మాటల్నీ, ఆయననూ కూడా మరిచిపోతారు.

# కార్యకర్తల స్థానాన్ని ఆక్రమించిన వ్యూహకర్తలు



నేటి కార్పొరేట్ ప్రపంచానికి తగినట్టు రాజకీయ పార్టీలు మారుతున్నాయి. గతంలో పార్టీలోనే వ్యూహకర్తలు ఉండేవారు. పార్టీ విధానాలకు తగినట్టు ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించేవారు. అయితే ఇప్పుడు వారు మాత్రమే సరిపోతారని ఏ పార్టీ అనుకోవటంలేదు.. పదు నైన వ్యూహాల కోసం బయటి సంస్థలను ఆశ్రయిస్తున్నాయి. దేశంలోని చాలా రాజకీయ పార్టీలు వ్యూహకర్తల్ని, వ్యూహ సంస్థల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు వారి సేవ ల్ని పొందుతు న్నాయి. ఈ క్రమంలో పార్టీల పని తీరులో, నాయకుల వ్యవహార శైలిలో మార్పు స్పష్టంగా కనిపి స్తోంది. ముఖ్యంగా సామాన్య ప్రజలతోనే కాకుండా కార్యకర్తలతో భేటీలను నాయకులు తగ్గించు కోవటం ఒక ముఖ్యపరిణామం. ఫలితంగా పార్టీ కార్యకర్తల ద్వారా పబ్లిక్ మూడ్ తెలుసుకునే పద్ధతికి దూరమయ్యారు. దాంతో ప్రజలు ఏమనుకుంటున్నారో వారికి ప్రత్యక్షంగా తెలియటం లేదు. తమ వ్యూహకర్తలో, సంస్థలో ఇచ్చే సమాచారం మీదే వారు ఎక్కువగా ఆధారపడుతున్నారు. దాంతో, ఎన్నికల్లో తమకు కలిసొచ్చే పరిస్థితుల కన్నా బెడిసికొట్టే సందర్భాలే ఎక్కువని తెలంగా ణ, ఏపీ ఎన్నికలు నిరూపించాయి.! పార్టీ టిక్కెట్లివ్వటం నుంచి ప్రచారాంశాలు, ప్రాధాన్యతలు, పదవులు, బాధ్యతల కేటాయింపు వరకు అన్నీ వ్యూహకర్తలు-సంస్థలు సర్వే జరిపి ఇచ్చే సమాచారం ఆధారంగా చేస్తున్నారు. ఒకోసారి సర్వే బూచి చూపి నాయకులతో తమ ఇష్టాయిష్టాలను అమలు చేయిస్తుంటారు. ఇక, పార్టీ గెలిస్తే తమవల్లే అంటారు...ఓడితే మాత్రం బాధ్యత వహించవు. 2019లో వైసీపీ 151 స్థానాలు గెలిస్తే, అది తమ క్రెడిట్‌గా చెప్పుకున్న ఐప్యాక్ ..2024లో అదే పార్టీ, 11 స్థానాలకు పడిపోయినపుడు ఓటమికి కూడా సమాన బాధ్యత వహించాలి కదా! కర్నాటకలో, తెలంగాణలో ఆనాడు నెలకొన్న రాజకీయ పరిస్థితులు వాతావరణం కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి కారణమయ్యాయి. కానీ, అదంతా తాము నమ్ముకున్న వ్యూహకర్త గొప్పతనమనుకొని పార్టీ వ్యవస్థ మొత్తాన్ని ఆయన చెప్పుచేతల్లో పెట్టింది. ఫలితం..హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘోర పరాజ యం. కాబట్టి ప్రజాదరణ ఉండాలే తప్ప వ్యూహం పన్ని, ప్రభుత్వాధికారుల్ని బదిలీ చేసినట్టు అభ్యర్థులను అటు ఇటు మారిస్తే గెలవరు. రెండు వేల సంవత్సర మొదటి దశకం నుంచి ఈ అవలక్షణాలు మొదలయ్యాయి. పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ సామాజిక వర్గాల- వృత్తుల నాయకుల మాటల్ని రాజకీయ పార్టీలు పరిగణనలోకి తీసుకోవడం లేదు, నేతలకు జనంతో సంపర్కం పోయింది. నెహ్రూ, ఇందిర, వాజ్‌పేయ్ వంటి కేంద్ర నాయకులతో పాటు చెన్నారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఎన్‌టిఆర్, వైఎస్ఆర్ వంటి రాష్ట్ర నాయకులు వివిధ పద్ధతుల్లో జనంతో కలిసిపోయారు. ప్రజల మనోగతంపై పార్టీల స్థాయిలో మథనం జరిగేది. జనాభిప్రాయం తెలుసుకొని, అవసరాలు తీరుస్తూ వారి విశ్వాసం పొందడం ద్వారా గెలవాలనే తలంపే క్రమంగా మరుగునపడుతోంది. పార్టీలు నియమించుకునే వ్యూహకర్తలు -సంస్థల్లోని అత్యధికులు మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినవారు. కనీసం గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియను కూడా సమీపంగా చూసి ఉండరు. ప్రజల్ని కేవలం ఓటర్లుగా, ఇంకా చెప్పాలంటే మార్కెట్‌గా చూసే వారి కంటికి రాజకీయ పార్టీ ఒక కమోడిటీగా మారింది. దానిని ఎలాగైనా కొనిపించటమే వారి పని! ఇక్కడ కొనపించటమంటే జనం తో ఓట్లేయించటం. ఈ పొలిటికల్ మార్కెటింగ్ ఎవరు బాగా చేస్తే వారే ఎన్నికల మార్కెట్లో నిలబడతారు. అందుకే, వారి నైపుణ్యాల అమ్ములపొది నుంచి స్కీంలు, రిబేట్లు, డిస్కౌంట్లు, ఆఫర్లు వచ్చాయి. నవరత్నాలయినా, గ్యారెంటీలయినా..వీటి మూలాలు ఈ వ్యూహకర్తల వ్యాపారపు మెదళ్ల నుంచి పుట్టినవే. ఇండియా షైనింగ్, నుంచి బై బై బాబు వరకు, ఇంటికో ఉద్యోగం నుంచి ప్రతి చేనుకు నీరు ప్రతి చేతికి పని వరకు, సబ్ కే సాత్ సబ్ కా వికాస్ నుంచి బాటింగేతో కాటింగే వరకు ప్రాసలతో కూడిన నినాదాల జోరంతా వ్యూహకర్తల చలువే! నినాదాలతో ప్రజల్ని అమాయ కులను చేసి తమ వైపుకు లాక్కోవాలనుకోవటానికి బదులు.. జనం అసలు ఏం కోరుకుంటున్నారో గ్రహించి, అవి తమ విధానాలుగా ప్రకటించే చొరవ రాజకీయ పార్టీల్లో ఉండాలి. కానీ దురదృష్ట వశత్తు ఇప్పుడు వాటిలో అది తగ్గుతోంది. రాజకీయం వ్యాపారం కాదు, సేవ అనే స్పృహ లోపిస్తోం ది. వ్యూహకర్తల ఎత్తులు-జిత్తుల కన్నా ప్రజల మనోభావాలే తమ రాజకీయ మనుగడను శాసిస్తాయ నే వాస్తవాన్ని పార్టీలు మరచిపోతున్నాయి. కార్యకర్తల్ని లక్ష్యపెట్టడం లేదు. రాజకీయ పార్టీలు ఒకప్పుడు సిద్ధాంతరీత్యా బలంగా ఉండేవి. విధానాలపై చర్చ, మేధో మథనానికి భేటీలు జరిగేవి. విధానపత్రాలు వెలువరించేది. ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలుండేవి. 1995లో అధికార మార్పిడి తర్వాత సిఎం అయిన చంద్రబాబు, అటు ప్రజాక్షేత్రంలో నిరంతర కార్యక్రమాల్లో, ఇటు పార్టీ కార్యాలయంలో రోజూ సగటున రెండు, మూడు గంటలు గడిపేవారు. అధికారంలో ఉన్నా, దాదాపు అన్ని ప్రధాన పార్టీలకూ కార్యక్రమాలుండేవి. అట్టడుగు స్థాయి సమావేశాలు, ఇంటింటికీ వెళ్లటం, ప్రతి మనిషినీ కలవడం వంటివి తరచూ జరిగేది. వీటన్నిటి ద్వారా ప్రజలతో రాజకీయ నాయకులకు ప్రత్యక్ష బంధం ఏర్పడేది. అది వారి ఆలోచనా విధానాన్ని, పాలనా పద్ధతుల్ని ప్రభావితం చేసేది. ఇప్పుడేమీ జరగట్లేదు, జరిగినా తూతూ మంత్రంగానే! కాలేజీలు, యూనివర్శిటీల్లో 'విద్యార్థి రాజకీయాల' ద్వారా యువతరం రాజకీయాల్లోకి వచ్చే మార్గమొకటి ఉండేది. అక్కడ్నుంచి యువనాయకుల్ని పార్టీలు ఎంపిక చేసుకునే 'క్యాంపస్ సెలక్షన్' పక్రియ అమలయ్యేది. ఫలితంగా ప్రజలనాడి ప్రాధాన్యత తెలిసిన యువతరం రాజకీయాల్లో క్రమంగా ఎదిగేది. పార్టీల్లో ప్రతి ఎన్నిక తర్వాత గెలుపోటముల్ని అధ్యయనం చేసే సమీక్షలుండేవి. చంద్రబాబు 27కు పరిమితమైనప్పుడు గానీ, జగన్మోహన్ రెడ్డి 11కు దిగజారినప్పుడు గానీ, కెసిఆర్ ఆరుమాసాల్లో రెండు ఎన్నికల్లో ఘోరంగా ఓడినపుడు గానీ నిజాయితీ సమీక్షలే జరుగలేదు.

# నిజం నిగ్గుతేల్చటంలోనూ నీతి పాటించాల్సిందే!

సోలార్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు విషయంలో గౌతమ్ అదాని అవినీతికి పాల్పడ్డారంటూ అమెరికా నుంచి వెలువడ్డ ఆరోపణలు దేశాన్ని కుదిపేశాయి. వ్యాపారవేత్తగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గౌతమ్ అదాని మీదా, అతని అనుయాయుల మీదా అమెరికాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ చేపట్టిన అవినీతి ఆరోపణల దర్యాప్తు నేపథ్యంలో మన దేశంలోని సంస్థలు కూడా దర్యాప్తు చేపట్టాల్సిన అగత్యం ఏర్పడింది. తమిళనాడు, ఒరిస్సా, జమ్మూకశ్మీర్, చత్తీస్‌గడ్ రాష్ట్రాలే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అదానీ గ్రీన్ %-% అజుర్ పవర్ గ్లోబల్ లిమిటెడ్ సంస్థలతో సోలార్ ఎనర్జీ విషయంలో సరఫరా ఒప్పందాలు చేసుకున్నాయని చెబుతున్నారు. అవినీతి ఆరోపణలు అమెరికాలోని హిండెన్‌బర్గ్ రిసెర్చి బయటపెట్టటంతో అదానీ సంస్థతో పాటు, భారతదేశ ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఇరుకున పడ్డాయి. ఈ విషయమై చర్చలూ వదంతులూ తారాస్థాయికి చేరుకున్నాయి. కానీ పరిష్కార మార్గాలను మాత్రం రాజకీయ నాయకులూ, ప్రభుత్వాలూ బయటపెట్టడం లేదు ప్రజల వద్ద నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నాయా లేదా అన్నది ప్రజలకు ముఖ్యం. ప్రజల అవసరాల నిమిత్తం సోలార్ ఎనర్జీ కొనుగోలు చేసిన విధానంలో అవినీతి చొరబడిందన్న అంశం మరో దేశం దర్యాప్తులో బయటపడినప్పుడు ప్రజలకు తాము ఎన్నుకొన్న ప్రభుత్వాల మీద నమ్మకం పోతుంది. ఇలా ఎన్ని రకాలుగా వారి సొమ్ము వారికి కాకుండా పోతున్నదో అన్న భయంతో కూడిన అనుమానాలు పెరుగుతాయి. పార్లమెంట్ సమావేశాలు ఈ సమస్యకు పరిష్కారం చూపించాల్సింది పోయి, సమస్యలో ఒక భాగంగా మారిపోవటం దురదృష్టకరం. నిజానికి అధికారపక్షం చొరవ చూపి ఇంతటి సంచలనాత్మక విషయానికి సంబంధించిన నిజానిజాలను సభల్లో



బయటపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ సమస్యకు ఒక పరిష్కార దిశగా చర్చలు కొనసాగించటానికి బదులు అధికార పక్షాన్ని ఇరుకునపెట్టాలని ప్రయత్నించటమూ దురదృష్టకరమే. సానుకూల ధోరణిలో అవగాహనతో కూడిన సంయమన దృక్పథంతో ఇరు పక్షాలూ వ్యవహరించినప్పుడే రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య మనుగడ సాధ్యపడుతుంది. ఏకపక్ష ధోరణిలో ఎవరు వ్యవహరించినా అంతిమంగా నష్టపోయేది రాజకీయ నాయకులూ, వ్యాపార సంస్థలూ కాదు ప్రజలు! కొన్ని సంవత్సరాల క్రిందట రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మన దేశానికి చెందిన ఒక జర్నలిస్ట్ విదేశంలో సేకరించిన సమాచారం వల్ల బయటపడిన భోఫోర్స్ ఉదంతం దేశాన్ని కుదిపేసింది. ఆనాటి ప్రధానమంత్రి అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణ సంచలనం కలిగించింది. ఇప్పటి అవినీతి సొమ్ముతో పోల్చుకుంటే అప్పటి సొమ్ము పరిగణనలోకి తీసుకోవాల్సినంత పెద్దదేమీ కాదు. కానీ ప్రజల డబ్బు ప్రజల డబ్బే, అవినీతి అవినీతే! జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఆనాటి ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి అలాంటి ప్రక్రియ పార్లమెంటుకు అందుబాటులో ఉన్నప్పుడు మీనమేషాలు లెక్కపెట్టాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉండకూడదు. పార్లమెంటు సమావేశాలు ముగిసేలోపు ఈ విషయంలో స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అడిగే హక్కు కూడా ఉంది. ప్రభుత్వానికి జవాబివ్వాల్సిన బాధ్యత ఉంది. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వ మార్గంలోకి నెట్టేయకూడదు!

మార్కెట్ షేర్ల ధరలను మానిప్యులేట్ చేయటంతో పాటు, జరిగిన ఒప్పందాలను, ఫండ్స్‌ను లాభసాటిగా వ్యాపారంలో తిప్పిన తీరును అదాని సంస్థ బయటపెట్టటానికి ఇబ్బంది పడటంతో ఈ వ్యవహారం ఇంత జటిలంగా మారింది. నిఘా సంస్థలు కానీ ప్రభుత్వాలకు సంబంధించిన రెగ్యులేటరీ సంస్థలు కానీ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో ఇప్పుడు మీడియాతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వం మీద %-% అదానీ సంస్థ మీద విమర్శ బాణాలు ఎక్కుపెట్టాయి. ఎక్కుపెట్టిన బాణం ఎవరికి తగులుతుందో అన్నది కాదు సమస్య, తప్పుచేసిన వారికి శిక్ష పడాల్సా లేదా అన్నదే సమస్య. నష్టపోతున్న ప్రజాధనాన్ని ప్రభుత్వాలు రాబట్టుకోలేవా అన్న ప్రశ్నకు జవాబు కోసమే ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించక తప్పదు. గౌతమ్ అదాని కేంద్రంలోని ప్రముఖులకు ఇష్టుడు అన్న అపవాదును తొలగించుకోక తప్పదు. రాష్ట్రాల ఒప్పందాలతో మాకు సంబంధం లేదు అన్నట్లు తప్పించుకొనే ధోరణి ఎంత మాత్రం సమంజసం కాదు. వారి ఏలుబడిలో ఉన్న రెండు మూడు రాష్ట్రాలు కూడా ఈ ఆరోపణలను ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకూ ఇప్పటి కూటమి ప్రభుత్వం ఈ ఆరోపణల వెనక నిజాలను తమ సంస్థల ద్వారా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెబుతున్నది. ఒప్పందాల పత్రాలూ నిర్ణయాలూ ఫైళ్లతో పాటు

# వీడియో మార్ఫింగ్ పై చర్యలు తీసుకోవాలి

**- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోతు రాంచంద్రునాయక్**


**- చట్టసభలో విప్ వ్యాఖ్యల వక్రీకరణపై స్పీకర్, శాసన మండలి స్పీకర్ లకు ఫిర్యాదు**



మరిపెడ డిసెంబర్ 12 తరంగాలు

డోర్నకల్ నియోజకవర్గం: రాష్ట్ర పరిపాలన సౌధమైన అసెంబ్లీలో కొనసాగుతున్న సమావేశాల సన్నివేశాలను, తన వ్యాఖ్యలను వీడియో మార్ఫింగ్ చేసి ప్రభుత్వాన్ని అపవాదు తెచ్చేలా సోషల్ మీడియాలో వైరల్ చేయడం సమంజసం కాదని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన సభా పర్వం ముగిసాకా పీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించి చట్టాలను రూపొందించే శాసనసభలోని వీడియోలను మార్ఫింగ్ చేయటం, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేయడం బీఆర్ఎస్ కుటిల బుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలలో వస్తున్న మెప్పును చూసి ఓర్వలేక అవాకులు చవాకులు పేలుతూ చివరకు ప్రభుత్వ విప్ స్పీచ్ ను మార్ఫింగ్ చేయటం తగదని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడి రాజ్యాంగబద్ధంగా శాసనసభలో ప్రభుత్వ పనులను, పథకాలను, ప్రస్తావిస్తూ చట్టాలు చేస్తూ ఉండబడే నేపథ్యంలో ఇలాంటి దుశ్చర్యలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ.. దశలవారీగా సంక్షేమాలు అందిస్తూ.. ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అబద్ధాలతో అడ్డుకోలేరన్నారు. పదేళ్లలో విధ్వంసం చేసి మళ్లీ ప్రభుత్వాన్ని అబద్ధపు వీడియోలతో బధనం చేయాలని చూస్తే ప్రజలు సహించరన్నారు. ప్రభుత్వాన్ని కించపరిచేలా ప్రభుత్వ విప్పు వ్యాఖ్యలను వక్రీకరించిన వారిపై, అదేవిధంగా సోషల్ మీడియాలో వాట్సాప్ గ్రూపులో షేర్ చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పీకర్ ను కోరినట్లు తెలిపారు.

# మంచిర్యాల జిల్లా లోని కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలి



మంచిర్యాల, డిసెంబర్ 12.(తరంగాలు)

హైదరాబాద్ కోకాపేటలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ సంఘం నూతన భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య కురుమ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కురుమ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశం చేతుల మీదుగా రేపు ప్రారంభిస్తున్న శుభ సందర్భంగా మంచిర్యాల జిల్లా కురుమ సంఘం ప్రజలు గుంట శ్రీశైలం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కురుమ సంఘం యువత అధ్యక్షుడు వేనంక శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# వీరబ్రహ్మేంద్ర స్వామి,సరస్వతి దేవి దేవాలయ నిర్మాణానికి విరాళం

**రూ.50,116 అందజేసిన బొల్లోజు శ్రీనివాస చారి..**



కేసముద్రం , డిసెంబర్ 11,( తరంగాలు)

కేసముద్రం మండలం కేసముద్రం విలేజీ లో నిర్మించబోయే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి,సరస్వతి దేవి దేవాలయాల నిర్మాణానికి కేసముద్రం విలేజ్ కి చెందిన బొల్లోజు జగన్నాథం కుమారుడు బొల్లోజు శ్రీనివాస్ చారి 51 వేల 116 రూపాయల భారీ విరాళం అందజేశారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, సరస్వతి దేవి దేవాలయాల నిర్మాణానికి విరాళం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.తాను విరాళం ఇవ్వడమే గాక ఇంక కొందరి భక్తుల నుండి విరాళాలు రావడానికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, దేవాలయాల నిర్మాణానికి అన్ని తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆలాగే దేవాలయాల నిర్మాణంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా వారు తెలిపారు. దేవాలయాల నిర్మాణం కమిటీ అధ్యక్షులు చిట్టోజు రమణాచారి మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణానికి బొల్లోజు శ్రీనివాస చారి భారీ విరాళం ఇవ్వడమే గాక తన సహాయ సహకారాలు అందించడం దేవాలయ నిర్మాణ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుడి నిర్మాణ కమిటీ అధ్యక్షులు చిట్టోజు రమణాచారి,ఉల్లి వెంకటేశ్వర్లు, బొల్లోజ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో ఘనంగా భారత్ ఉత్సవ్ కార్యక్రమం



కేసముద్రం, డిసెంబర్ 12, (తరంగాలు)

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ కళాశాలలో ఘనంగా భారత్ ఉత్సవ్ కార్యక్రమాలు జరిగాయి. డీఈవో ఆదేశాల మేరకు కళాశాలలో తెలుగు, హిందీ ప్రావీణ్యం కలిగిన 50 మంది కవుల చిత్రపటాలతో ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడుతూ భారత్ ఉత్సవ్ అనేది భారతదేశ సంప్రదాయాలు,సాంస్కృతిక వైవిధ్యాన్ని ఆచరించే వేడుకల సమాహారం అన్నారు.భారతదేశం అనేక భిన్నమైన సంస్కృతులు,భాషలు, మరియు సంప్రదాయాల సమ్మేళనమని,భారత్ ఉత్సవ్ ద్వారా దేశంలోని వైవిధ్యాన్ని మరియు సాంస్కృతిక ఐక్యతను ప్రదర్శిస్తారన్నారు.ఇది ప్రాముఖ్యమైన జాతీయ పండుగలు,రాష్ట్ర స్థాయి ఉత్సవాలు మరియు ప్రదేశానికి ప్రత్యేకమైన వేడుకలను కలిగి ఉంటుందన్నారు.ఈ ఉత్సవాల్లో దసరా,దీపావళి, హోలీ, క్రిస్మస్, మరియు రంజాన్ వంటి పండుగలు అలాగే సంగీతం, నృత్యం, మరియు హస్తకళలు వంటి కలలు ఉంటాయని తెలిపారు.వివిధ భాషలలో పాటలు, నాటకాలు, మరియు కథలు ప్రజల మనసులలో ఐక్యతను కలిగిస్తాయని,ఈ ప్రదేశానికి ప్రత్యేకమైన ఆహారాలు,వస్త్రాలు మరియు సంప్రదాయాలను ఈ ఉత్సవాల ద్వారా ప్రోత్సహిస్తారన్నారు.భారత్ ఉత్సవ్ ప్రపంచానికి భారతదేశ వైభవాన్ని పరిచయం చేస్తుందని,సాంస్కృతిక మార్పిడి,దేశంలోని భిన్నత్వంలో ఐక్యతను ఉత్సవాల ద్వారా పునరుద్ధరిస్తుందన్నారు.భారతదేశం ఉత్సవాల ద్వారా ప్రపంచానికి శాంతి,సౌభ్రాత్రత, మరియు ఐక్యత చాటుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నరసయ్య ,సోమయ్య ,ప్రసాద్, వీరబాబు ,శ్వేత ,శ్రీదేవి ,ప్రవళిక, అరుణ భాయి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ముస్లిం సబ్ ప్లాన్ అమలు చేయాలి

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత**




వరంగల్,12డిసెంబర్(తరంగాలు):



రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సబ్ ప్లాన్ ను అమలు చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు.గురువారం ముస్లిం సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరుతూ ముస్లింలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముస్లిం సబ్ ప్లాన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సబ్ ప్లాన్ ఊసే ఎత్తలేదన్నారు.అదేవిదంగా వచ్చే సంవత్సరం మార్చిలో 7 ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నాయని,అందులో భాగంగా ముగ్గురు ముస్లింలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.సంవత్సరకాలం కాంగ్రెస్ పరిపాలనలో ఇంతవరకు ముస్లింలకు మంత్రి పదవి ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు.ముస్లింల సమస్యలు చెప్పుకోవడానికి రాష్ట్రంలో ప్రభుత్వం తరుపున తమ ప్రతినిధి ఎవరు లేరని,త్వరితగతిన ముస్లింలకు మంత్రి పదవి కేటాయించి గౌరవించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ నయీముద్దీన్, మహమ్మద్ ఇస్మాయిల్,తస్లీం, ఖానం,మొహమ్మద్ ఆరిఫ్, హుస్సేన్,ఆబిద్, హుస్సేన్,సర్దార్ అలీ, ఆమీనబి,రషత్,యాస్మిన్, యాకూబ్,అబ్దుల్లా ఖాన్,హసన్, అప్సర్, మజహార్, ఆరిఫ్,లాల్ మొహమ్మద్, అహ్మద్, రహీం,ఫెరోస్, ఇంతియాజ్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఎరువుల దుకాణాలపై కఠిన చర్యలు తప్పవు




కేసముద్రం, డిసెంబర్ 12, (తరంగాలు)

కేసముద్రం మండలంలోని పలుఎరువులు,పురుగుమందుల దుకాణాలను మహబూబాద్ జిల్లా వ్యవసాయ అధికారిని యం.విజయనిర్మల మండల వ్యవసాయ అధికారి కేసముద్రం బి.వెంకన్నతో కలిసి అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఎరువుల డీలర్లు,విధిగా స్టాక్ రిజిస్టర్లు బిల్ బుక్కులు,ఇన్వైసులు,మైంటైన్ చేయాలని వారు తెలిపారు.అదేవిధంగా ఈపాస్ మిషన్ బ్యాలెన్స్,గోదాం బ్యాలెన్స్,స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్,సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని వారు కోరారు.రైతులకు ఆధార్ కార్డు మీద మాత్రమే ఎరువులను సప్లై చేయాలని సూచించారు.అలాగే రాజరాజేశ్వరి ఎరువుల దుకాణం యందు ఎరువుల లైసెన్స్ లో,కంపెనీ ఓ ఫామ్ ఇంక్లూడ్ చేయని కారణంగా,21 టన్నుల యూరియా,10.55 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు.ఎరువుల లైసెన్స్ లో ఓ ఫామ్ ఎంట్రీ చేసిన పిదప,మాత్రమే అటువంటి ఎరువులను అమ్మాలని సూచించారు.నియమ,నిబంధనలు పాటించని డీలర్లపై,ఎరువులు,విత్తన పురుగుమందుల చట్టం ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా






వరంగల్ ప్రతినిధి ,12 డిసెంబర్(తరంగాలు):

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా,ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి గురువారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు.ఈ తనిఖీలో నాయబ్ తహసీల్దార్ రంజిత్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుండి శ్యామ్ సుందర్, ఏ ఐ ఎం ఐ ఎం నుండి ఫైజోద్దీన్, బిజెపి హరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## గంట సంజీవరెడ్డిని కలిసిన మర్రి నారాయణరావు



కేసముద్రం, డిసెంబర్ 12, (తరంగాలు)
కేసముద్రం వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డిని మాజీ ఏఎంసీ చైర్మన్ మర్రి నారాయణరావు వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో గల తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డిని నారాయణరావు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరలింగేశ్వరరావు, రాము రెడ్డి,రాజేందర్,తోకల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తాకి గేదె మృతి



కేసముద్రం, డిసెంబర్ 12, (తరంగాలు)
కల్వల గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగలడంతో గేదె దూడ మృతి చెందింది.కల్వల గ్రామానికి చెందిన రైతు ఆకుల సుధాకర్ వ్యవసాయంతో పాటు జీవనోపాధికి డైరీ ఫాం కూడా నిర్వహిస్తున్నాడు. గురువారం తనకు చెందిన గేదెలను మేతకు తీసుకెళ్లగా అందులో ఒక బర్రె దూడ అప్పటికే తెగిపడి క్రింద ఉండబడిన విద్యుత్ తీగకు తగిలి విద్యుత్ షాక్ తో మరణించడం జరిగింది.బర్రె దూడ మృతితో సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లినట్టు రైతు సుధాకర్ వాపోయాడు.

## ఎదేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు



కేసముద్రం , డిసెంబర్ 12,( తరంగాలు)
కేసముద్రం మండలానికి కూత వేటు దూరములో భూక్యరాం తండా కేసముద్రం విలేజ్ పంచాయతీ పరిధిలో సాగుతున్నాయి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి వాటికి అనుమతులు ఏ విధంగా వచ్చాయి అనేది అంతుచిక్కని పరిస్థితి ఇట్టి అక్రమ నిర్మాణాల వెనక పెద్దతంగమైన నడుస్తున్నదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు ప్రభుత్వ భూమి విచ్చలవిడిగా కబ్జాకు గురవుతుందని ప్రజలు బాహాటంగానే అంటున్నారు. అసలు ఆ నిర్మాణాలు చేయడానికి అనుమతులు ఎవరు ఇచ్చారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతుంది అక్రమాలకు గురవుతున్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి...?

## క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న మండల కాంగ్రెస్ నాయకులు



చెన్నూర్, డిసెంబర్ 12. (తరంగాలు)
భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాల ప్రాంగణంలో, సీఎం కప్ క్రీడా పోటీలు జరుగుతున్న సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భీమారం మండల కాంగ్రెస్ నాయకులు మంతెన సమ్మయ్య, మాట్లాడుతూ.. పాఠశాల దశ నుండి చదువుతో పాటు, క్రీడలపై ఆసక్తి కనబర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా పీటీ లు, పీడీ లు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఓబీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానమివ్వరా?





**-రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**
**-ఓబీసీ ప్రముఖులతో కలిసి హక్కుల సాధనకు ఢిల్లీలో ఆందోళన**

న్యూఢిల్లీ,12డిసెంబర్(తరంగాలు):
ఎన్నికలప్పుడు ఓబీసీల ఓట్లయితే కావాలి కానీ రాజ్యాధికారంలో సముచిత స్థానం ఎందుకు కల్పించడం లేదంటూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పాలకులను నిలదీశారు.దేశ జనాభాలో తాము 60శాతానికి పైగా ఉన్నా కూడా అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంపీ రవిచంద్ర ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం ఓబీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపకులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి,మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్దార్ పుటం పురుషోత్తమ రావు తదితరులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి, దేశవ్యాప్తంగా కులగణనను వెంటనే చేపట్టాలి, చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలంటూ ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏండ్లు గడిచినా కూడా ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఓబీసీకి చెందిన వారైనప్పటికీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు.ఓబీసీల న్యాయమైన హక్కుల సాధనకు,వాటా దక్కించుకునేందుకు పార్లమెంట్ లోపల,బయట బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తున్నదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.మన న్యాయమైన హక్కుల సాధనకు ఈ జంతర్ మంతర్ వద్ద బడుగుల లింగయ్య యాదవ్,శ్రీనివాస్ గౌడ్,బీద మస్తాన్ రావు తదితర ప్రముఖులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు గట్టిగా డిమాండ్ చేశామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో బీసీలకు సముచిత ప్రాధాన్యత లభించిందని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.కేసీఆర్ బీసీలు,రైతులు,బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల పక్షపాతి అని,ఆయన హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఆయన వివరించారు.రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో బీసీలు ఇద్దరు మాత్రమే ఉన్నారని,ఖాళీగా ఉన్న 6 స్థానాల భర్తీ సందర్భంగా తమకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని ఆయన కోరారు.దేశవ్యాప్తంగా కులగణనను వెంటనే చేపట్టి పార్లమెంటులో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా చట్టసభల్లో తమకు 33%రిజర్వేషన్స్ కల్పిస్తూ మహిళలతో పాటు అమలుపర్చాలని ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో తమ ఓబీసీలకు న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా గొంతెత్తి నినదిస్తూనే ఉంటుందని చేశారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు సిద్ధేశ్వర్, కిరణ్,వేల్పుల శ్రీనివాస్, పర్వతం సతీష్, అరుణ, చామకూరి రాజు, డీ వేలాద్రి, కే.వీ.గౌడ్ తదితరులతో కలిసి వందలాది మంది పాల్గొన్నారు.

# విద్య,వైద్య రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట





**-స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధే నా ఏజెండా**
**-ఒక్క ఏడాది పాలనలోనే 750 కోట్ల అభివృద్ధి పనులకు జీవోలు తీసుకొచ్చా**
**-జనవరి నెలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**-గత బిఆర్ఎస్ పాలనలో నియోజక వర్గం అభివృద్ధి జరగలేదు**
**-వచ్చే నాలుగేళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా**
**-ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



స్టేషన్ ఘనపూర్, 12డిసెంబర్ (తరంగాలు ):
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండలం మల్కాపూర్ పీ.హెచ్.సీ కి మంజూరైన 108 సర్వీస్ అంబులెన్స్ ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర సర్కార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 681 మంది వైద్యులను నియమించిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలుమార్లు కలిసి వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. అందుకు ఆర్టీసీ ఆధీనంలో ఉన్న నాలుగు ఎకరాల భూమిని 100 పడకల ఆసుపత్రికి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరగా వారు మంజూరు ఇచ్చినట్లు వెల్లడించారు. త్వరలో 45 కోట్లతో ఆసుపత్రి భవనాన్ని నిర్మించుకోబోతున్నామని తెలియజేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మొత్తం 9 పీ.హెచ్.సీ లు ఉన్నాయని మరో 3 పీ.హెచ్.సీ లు చిల్పూరు, పెద్ద పెండ్యాల, కంచనపల్లికి రాబోతున్నాయని వెల్లడించారు.పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే దిశగా 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను త్వరలో నిర్మించుకోబోతున్నామని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధే నా ఏజెండా అని ఎమ్మెల్యే తెలిపారు. ఒక్క ఏడాది పాలనలోనే నియోజకవర్గ అభివృద్ధి పనులకు 750 కోట్ల జీవోలు తీసుకువచ్చానన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏఒక్క నియోజకవర్గానికి ఇన్ని నిధులు రాలేదన్నారు. జనవరి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోబోతున్నామని, అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనలో నియోజక వర్గం అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వచ్చే నాలుగేళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యోగ గురువు 'బి 'సుధాకర్ గౌడ్ 'ఉద్బోధ



**అత్తాపూర్ డిసెంబర్ 12, (తరంగాలు)**
భారతీయ సమాజంలో వివాహ వార్షికోత్సవం ఆత్మీయత అనుబంధాలకు వారధిగా నిలుస్తుందని కుటుంబ వ్యవస్థ సుస్థిరతలో వివాహం బహుముఖ భూమిక పోషిస్తుందని ఏ 'బి 'సి' లాఫింగ్ క్లబ్ 'అత్తాపూర్ యోగ సెంటర్' "యోగ గురువు" గారు. బి 'సుధాకర్ గౌడ్, ఉద్బోధించారు. యోగ సెంటర్ సీనియర్ సభ్యులు ' సీనియర్ సిటిజన్' తెలంగాణ ఎకనామిక్ ఫోరం' సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక' రాష్ట్ర అధ్యక్షులు' నేదునూరి కనకయ్య' శ్రీమతి నేదునూరి సరితా కుమారి దంపతుల 44'వ వివాహ వార్షికోత్సవం పెళ్ళి రోజు ఎసిబి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. వివాహ వార్షికోత్సవ వేడుకలకు అధ్యక్షత వహించిన ఏ' బి 'సి 'లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ గౌరవాధ్యక్షులు 'ప్రముఖ 'డాక్టర్ 'బి ' సీతారాం మాట్లాడుతూ మెరుగైన సమాజ సంబంధాల బలోపేతానికి పేతానికి వివాహ వార్షికోత్సవాలు పునాదులుగా నిలవడం భారతీయ సంస్కృతికి ప్రతిబింబం అని అన్నారు. నేడు లక్ష్మినగర్ కాలనీ ' జి 'హెచ్' 'ఎం'సి అత్తాపూర్ పార్కులో ఎ 'బి'సి లాఫింగ్ క్లబ్ & అత్తాపూర్ యోగ సెంటర్ అద్వర్ర్యంలో శ్రీమతి నేదునూరి సరితా కుమారి -& శ్రీ నేదునూరి కనకయ్య దంపతుల 44' వ 'సంవత్సరం వివాహ వార్షికోత్సవ వేడుకలు ఎ'బి'సి లాఫింగ్ క్లబ్ 'అత్తాపూర్ యోగ సెంటర్ అద్వర్ర్యంలో సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఎ 'బి'సి లాఫింగ్ క్లబ్ం అత్తాపూర్ యోగ సెంటర్ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ 'బి 'భానుమతి మాట్లాడుతూ వివాహవార్షికోత్సవం రోజున జంటలు తమ ప్రమాణాలను పునరుదరించుకొని భవిష్యత్తు జీవితానికి మెరుగైన కార్యాచరణ రూపొందించుకొని ముందుకుసాగాలని అన్నారు. ఎసిబి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ కన్వీనర్ స్వామి సుధాకర్ గుప్తా మాట్లాడుతూ వివాహ వ్యవస్థ సమాజంలో ప్రేమ ' అనురాగం ఆప్యాయత 'వాత్సల్యం త్యాగం'బంధాలు' అనుబంధాలు 'ఆత్మీయతలు' పెంచి పంచడంలో వివాహ వ్యవస్థ ప్రభావ శీల పాత్రపోషిస్తుందని అన్నారు. ఎ 'బి'సి లాఫింగ్ క్లబ్ అత్తాపూర్ యోగ సెంటర్' కో కన్వీనర్ 'వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్ 'మహేందర్ మాట్లాడుతూ వివాహ వార్షికోత్సవాలు ఆప్యాయత అనురాగాలు 'ఆర్థత అవగాహన చైతన్య వేదికలుగా నిలవడం భారతీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఎ'బి'సి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగ సెంటర్' సీనియర్ సభ్యులు నరసింహా' మిట్టపల్లి నరసింహ రావు' మాట్లాడుతూ నమ్మకం 'విశ్వసనీయతకు వివాహ వ్యవస్థ ప్రతీకగా నిలవడం భారతీయ సామాజిక నాగరికతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఎబిసి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో సభ్యులు తమ 44వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా తెలంగాణ ఎకనామిక్ ఫోరం 'సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక 'రాష్ట్ర అధ్యక్షులు 'నేదునూరి కనకయ్య మాట్లాడుతూ స్నేహితులతో ప్రియమైన వారితో కుటుంబ సభ్యుల మధ్య వివాహ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకుంటే సంతోషం వెల్లివిరిసి ఆనందం ఆరోగ్యం ఇనుమడిస్తుందని అన్నారు. తమ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని స్పందిస్తూ శ్రీమతి నేదునూరి సరిత కుమారి శ్రీ ' నేదునూరి కనకయ్య ' దంపతులు' ఎ 'బి'సి లాఫింగ్ క్లబ్' అత్తాపూర్ యోగ సెంటర్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు శ్రీమతి నేదునూరి సరితా కుమారి శ్రీ 'నేధునూరి కనకయ్య దంపతులను సభ్యులు శాలువాతో పూలమాలతో సన్మానించి శుభ ఆశీస్సులు తెలియ చేశారు. ఈ సందర్భంగా యోగ సెంటర్ సభ్యులు శ్రీ బోజిరెడ్డి దంపతులను వారి పెళ్లి రోజు సందర్భంగా కేకు కట్ చేసి శాలువాతో సన్మానించారు. భావి జీవితం సంతోషంగా ఉల్లాసంగా ఉత్సాహంగా సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సమాజంలో ఉత్తమ దంపతులుగా రాణించాలని ఎ' బి' సి లాఫింగ్ క్లబ్ 'అత్తాపూర్ యోగ సెంటర్ సభ్యులు. ఆశీర్వదించారు.


# సీఎం రేవంత్ రెడ్డి ని దూషించిన మహిళ





**-కెపిహెచ్బి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ యువ నాయకుడు శివ చౌదరి...**
**-మహిళపై కేసు నమోదు నమోదు చేసిన పోలీసులు**

**కూకట్ పల్లి డిసెంబర్ 12, (తరంగాలు)**
కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి పరిధిలోని ఫుట్ పాత్ లపై, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా పర్మినెంట్ షేడ్స్ నిర్మించడంతో మంగళవారం జిహెచ్ఎంసి అధికారులు, పోలీసులు ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించిన నేపథ్యంలో ఓ మహిళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వారి సతీమణి గీత, ఆయన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి తీవ్రంగా ఖండిస్తూ బుధవారం సదరు మహిళలపై కేపీహెచ్బీ పోలీస్



స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ ఆక్రమణల కూల్చివేత నేపథ్యంలో షెడ్ నిర్మించిన మహిళ ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యుల పైన అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని దూషించడం వ్యక్తిగత విమర్శలతో గౌరవం తగ్గించే విధంగా మాట్లాడడం తగదని హెచ్చరించారు. అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగించింది ప్రజా సంక్షేమం, ప్రజా వినియోగం మాత్రమేనని దీనిలో అధికారులు వారి అధికారంలో భాగంగానే తొలగించారు గాని ప్రభుత్వానికి ఏ దురుద్దేశం లేదని అది ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. ఈ మహిళ వ్యాఖ్యల వెనుక ఇతర రాజకీయ పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులలో తప్పుడు ప్రచారాలు చేసిన, పెయిడ్ ఆర్టిస్టులు ద్వారా ఇలాంటి వీడియోలు తీసి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి గౌరవాన్ని తగ్గించాలని చూసినా ఉపేక్షించేది లేదని ఖబర్దార్ అంటూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నూతన సిబ్బందికి కూంబింగ్ లో శిక్షణ


**నారాయణఖేడ్, డిసెంబర్ 12, (తరంగాలు)**



నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 6 పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన నూతన సిబ్బందికి కూంబింగ్ కు సంబం ధించిన విషయాలపై డిఎస్పీ వెంకట్ రెడ్డి గురువారం సలహాలు,సూచనలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖేడ్ లోని మారుమూల ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలకు ఆరు పోలీస్ స్టేషన్ పరిధిలో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుంది అన్నారు.ఆయనతో పాటు వెంట నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ పరిధిలోని ఎస్ఐలు,సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు మృతి.

**జగిత్యాల టౌన్ డిసెంబర్ 12, (తరంగాలు)**



జగిత్యాల పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చేని నగేష్ (61) గురువారం ఉదయం మృతి చెందారు. చేని నగేష్ మలి దశ తెలంగాణ ఉద్యమ జేఏసీలో క్రియాశీల పాత్ర పోషించారు. జగిత్యాల పట్టణంలోని కృష్ణా నగర్ కు చెందిన చేని నగేష్ రేషన్ డీలర్ గా కొనసాగుతున్నారు. గతంలో తెలుగుదేశం పట్టణ కార్యవర్గంలో పలు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పూసల సంఘానికి గౌరవ అధ్యక్షునిగా కొనసాగుతుండగా, ఆ సంఘం రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. నగేష్ స్థానికంగా సుపరిచితుడు కావడంతో ఆయన ఆకస్మిక మృతి పట్ల జగిత్యాల పట్టణానికి చెందిన రాజకీయ ప్రముఖులు, మేధావులు,పలువురు విద్యావంతులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం వెలిబుచ్చారు.

## ఎ2శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఘనంగా అయ్యప్ప స్వామి 24వ మండల పూజ



**కూకట్ పల్లి, డిసెంబర్ 12, (తరంగాలు)**
ఫతేనగర్ లోని శ్రీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వర అయ్యప్ప దేవస్థానం నందు 24వ అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం గురువారం నాడు కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి భజన కార్ర్యమంలో పెద్ద సంఖ్యలో స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి మహామంత్ర పారాయణం ఆలపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ శివపురం రామయోగి, మన్నెం నాగేందర్, రమణ గురుస్వామి, మూర్తి గురుస్వామి, ఉపేందర్ గురుస్వామి, ఆర్.కె గురుస్వామి, వాసు స్వామి, చిన్న స్వామి, సంతోష్ స్వామి, నాగరాజు స్వామి, సుబ్బయ్య స్వామి, సత్యం స్వామి, సోమేశ్ స్వామి, ఏడుకొండలు స్వామి, నాగేశ్వరరావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తన తండ్రి 25 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన మరబోయిన అనిల్ కుమార్ యాదవ్

**శేరి లింగంపల్లి డిసెంబర్ 12, (తరంగాలు)**



ఈరోజు మసీదు బండ లో ఈరోజు మసీదు బండ లో కాంగ్రెస్ నాయకుడు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ నివాసంలో తన తండ్రి కీర్తిశేషులు సత్యనారాయణ యాదవ్ 25వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరే విధంగా ఆ భగవంతుని కోరుకుంటూ వారి జ్ఞాపకార్థం మసీదు బండ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని ,విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మా పెదనాన్న మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ మరియు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన బాల్య మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన చిన్ననాటి మిత్రులు



**డిసెంబర్ 12, (తరంగాలు)రామన్నపేట**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన ఓంటేద్దు సైదులు జీవనాధారం కోసం హైదరాబాద్ లోని మేడిపల్లిలో స్థిరపడ్డాడు,ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ కి గురై మరణించాడు.విషయం తెలుసుకున్న తోటి బాల్యమిత్రులు అందరూ కలిసి ఆర్థిక సహాయం కింద 13,500 రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కనకబోయిన వెంకటేష్,చిన్నం కృష్ణ, కొండేం మహేందర్,వల్లాల శ్రీనివాస్,ఒంటెద్దు రమేష్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు జీవశాస్త్రం బిట్ బ్యాంక్ పుస్తకాలు అందజేత



**పెబ్బేరు డిసెంబర్ 12, (తరంగాలు)**
పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ తన శిష్యుల కోసం రవిశంకర్ స్కూల్ అసిస్టెంట్ బయోసెన్స్ తన సొంతంగా రాసి తయారుచేసిన జీవశాస్త్రం బిట్ బ్యాంక్ పుస్తకాలను స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా అందజేశారు.విద్యార్థులు తన మెటీరియల్ తో మంచిగా ప్రిపేర్ అయి బాగా చదువుకోవాలని మంచి ర్యాంకులు తెచ్చుకోవాలని రవిశంకర్ విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

**-టీఎస్ జేయు డిమాండ్**

**-సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన టీఎస్ జేయు బృందం**

**-చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చెపట్టాలి**

**-జర్నలిస్ట్ పెన్షన్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**



**హైదరాబాద్, డిసెంబర్ 12, (తరంగాలు)** ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల కోసం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్లుగా జర్నలిస్టు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని టీఎస్జేయు రాష్ట్ర కమిటీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. అలాగే 10 లక్షల రూపాయల ఉచిత జీవిత బీమా సదుపాయం కల్పించాలని టీఎస్ జేయు నాయకత్వం మంత్రిని కోరింది. అక్రిడేషన్ల కమిటీలు పునరుద్ధరణ చేసి జర్నలిస్ట్ లందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలనికోరారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను జర్నలిస్టుల అందరికీ అందేలా చూడాలని కమిటీ కోరింది. రాబోయే అక్రిడేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్టు సంఘాలకు భాగస్వామ్యం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజ్ పటేల్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు క్రాంతి కుమార్ అశోక్ తదితరులు ఉన్నారు.

# ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు





**నారాయణఖేడ్,డిసెంబర్ 12, (తరంగాలు)** నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని పలు దుకాణాలలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థలు, సామాగ్రీ, వస్తువులను పార్సిల్ చేయడానికి ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లను పట్టుకొని దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. అనంతరం శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్,వైస్ చైర్మన్ దారం శంకర్ ల ఆదేశాల మేరకు దాడులు చేయడం జరిగింది అన్నారు. ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల పర్యావరణానికి ప్రమాదం కలుగుతుంది అన్నారు.ప్లాస్టిక్ కవర్లు అమ్మడం,కొనడం నిషేధం కాబట్టి ఎవ్వరు ఉపయోగించిన చర్యలు తప్పవు అన్నారు.ఆయనతో పాటు మున్సిపల్ కార్మికులు ఉన్నారు

# సిఎం కప్ విజేతలకు బహుమతుల అందజేత







**నారాయణఖేడ్,డిసెంబర్ 12, (తరంగాలు)** నారాయణఖేడ్ పట్టణంలోని తహసీల్ క్రీడా మైదానంలో గత 3 రోజులుగా కొనసాగుతున్న సిఎం కప్ క్రీడలు గురువారంతో ముగిశాయి. గెలుపొందిన విజేతలకు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్,మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్,వైస్ చైర్మన్ దారం శంకర్ లు బహుమతులు అందజేశారు. అదేవిధంగా క్రీడలను విజయవంతం చేసిన పిఈటి లను శాలువాలతో సన్మానించి,షీల్డ్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద, రాజేష్,నాయకులు హన్మండ్లు,సద్దాం, ముజమ్మిల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల అప్లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలి


**-మంత్రి పొంగులేటి**



**వికారాబాద్, డిసెంబర్ 12, (తరంగాలు)** ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల అప్లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ముఖ్య కార్యదర్శి శాంత కుమారి, ప్రభుత్వ సలహాదారు వేమ నరేందర్ రెడ్డి లతో కలిసి ప్రజాపాలన లో వచ్చిన ఇండ్ల దరఖాస్తుల యాప్ అప్లోడ్ ప్రక్రియ, వసతి గృహాల్లోని వసతులు, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, వసతి గృహాల్లో డైట్ చార్జీల పెంపు అమలుపై జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజపాలనలో ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికి అదేవిధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్హులైన వారి వివరాలను అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి సంబందిత అధికారులకు సూచించారు. పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీల పెంచినందున డిసెంబర్ 14 న అన్ని కేంద్రాల్లో కొత్త మెనుతో భోజనాన్ని ప్రారంభించాలని మంత్రి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పరిగి తహసిల్దార్ కార్యాలయం నుండి గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

# బీమాతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా

**నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



**డిసెంబర్ 12, (తరంగాలు)** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తల కుటుంబాలకు అందించే బీమా సౌకర్యం వారి కుటుంబాలకు భరోసానిస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు ఇటీవల ప్రమాదాల బారినపడి మరణించిన రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రాస అశోక్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమ చెక్కును మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేతుల మీదుగా కార్యకర్తల కుటుంబీకులకు పంపిణి చేశారు, కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు బాసటగా నిలవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రమాద భీమా సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్ నాయకులు కన్నెబోయిన బలరాం ఎస్కే చాంద్ మందడి సాగర్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు గర్దాస్ విక్రమ్ రవ్వ నరసింహ నాయకులు మంటి లింగస్వామి రాస వెంకటేశ్వర్లు గర్దాస్ కరుణాకర్ పావుడల వెంకటేశం నల్ల చంద్రయ్య పావిరాల నరసింహ కళ్లెం స్వామి కర్రే శీను తదితరులు పాల్గొనడం జరిగింది

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం మహా ధర్నా

**-పెబ్బేరు వనపర్తి రోడ్డు పనులు డ్రైనేజ్ పెండింగ్ పనుల కోసం**

**-నిధులు ఉన్న అసంపూర్తిగా రోడ్ వైన్డింగ్ పనులు**



**పెబ్బేరు డిసెంబర్ 12, (తరంగాలు)** పెబ్బేర్ మున్సిపల్ పట్టణ పరిధిలో గురువారం రోజు బిఆర్ఎస్ ఉమ్మడి పెబ్బేరు మండల పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గం మహా ధర్నా చేపట్టారు ధర్నాలో భాగంగా సుభాష్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను తరలించే క్రమంలో పోలీసులకు తోపులాట జరిగింది అనంతరం వారిని పెబ్బేరు ఎస్ ఐ సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ కు తరలించారు. తరలించిన వారిపై కేసు నమోదు చేశామని వారు తెలియజేశారు చట్టానికి వ్యతిరేకంగా అడ్డువచ్చే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ట్రాఫిక్కుకు జనాలకు ఇబ్బంది కలిగించే ఏ విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని ఎస్ఐ తెలియజేశారు.ధర్నాలో భాగంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పెబ్బేరు వనపర్తి రోడ్డులో ఇల్లు కోల్పోయిన కొందరు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు లో నివసించుటకు సుముఖంగా ఉన్నారు వారికి వెంటనే పట్టాలు అందించాలని, పెబ్బేర్ పట్టణంలో గల వనపర్తి రోడ్డు రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైన తరుణంలో గత ప్రభుత్వ హాయంలో రోడ్డు విస్తరణ చేసి డ్రైనేజీ పనుల కొరకు రెండు కోట్ల 80 లక్షల వ్యాయామంతో టెండర్ జరిగి అగ్రిమెంట్ అయిన తర్వాత కూడా కాంట్రాక్టర్ ఇప్పటివరకు ఎలాంటి రోడ్డు పనులు మొదలు పెట్టడం లేదు అందుకు గల కారణం తెలుసుకొని సంబంధిత కాంట్రాక్టర్ ను అధికారులు ఆదేశించి అట్టి పనులను త్వరగా మొదలు పెట్టాలని అలాగే రోడ్డు విస్తరణలో భాగంగా దాదాపు 140 మంది పట్టణవాసులు పట్టణ అభివృద్ధి కొరకు సహకరించిన్న మరి కొంతమంది ఇళ్లను తొలగించుటకు సుముఖంగా లేరు అందువల్ల ఆ పనులను మున్సిపల్ కమిషనర్ మరియు తీపివోను ఆదేశించి పనులు త్వరగా చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ పాలకవర్గం బిఆర్ఎస్ ఉమ్మడి మండల నాయకు లు కార్యకర్తలు పట్టణవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు

## కష్టజీవుల పక్షాన రాజీలేని సమరశీల పోరాటం చేసిన నాయకుడు

# అమరజీవి కామ్రేడ్ సోమ రాజన్న కు ఘన నివాళి:మైదం శెట్టి రమేష్

శేరి లింగంపల్లి డిసెంబర్ 12, (తరంగాలు)

మియాపూర్ స్టాలిన్ నగర్ లో ఎంసీపీ ఐ (యూ )గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ సోమ రాజన్న, అమరవీరుడు కామ్రేడ్ గోనె చేరాలు గార్ల వర్ధంతి సందర్భంగా ఈరోజు స్టాలిన్ నగర్లో వారి చిత్రపటాలకు పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ మాట్లాడుతూ కామ్రేడ్ సోమ రాజన్న ఎంసిపిఐ(యు )ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా కేంద్ర కమిటీ సభ్యులుగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంతో వర్గ స్ఫూర్తితో కష్టజీవుల పక్షాన సమరశిలా పోరాటాల నిర్మించిన కష్టజీవుల కదలితరంగా పీడితపక్షాన రాజి లేని పోరాటాల నిర్మించిన నేత కామ్రేడ్ సోమరాజన్న 2014 డిసెంబర్ 12వ తేదీన అమరత్వం పొందారు. కామ్రేడ్ సోమరాజన్న ప్రజలపై ఎలాంటి దోపిడి పీడనాలు సాగకుండా ప్రజాసంఘాల నిర్మాణం చేసి రైతు,గీత, గిరిజన, యువజన, విద్యార్థి మహిళా పోరాటాలకు అండగా నిలిచిన చైతన్య ప్రదాత కామ్రేడ్ సోమరాజన్న, అవినీతి, లంచగొండితనం, అక్రమ డిపాజిట్లు పెట్టిన ప్రజలను పట్టి పీడించే ప్రజా కంతకులను సింహా స్వప్నము గా నిలిచిన ధీరశాలి



గొప్ప పోరాట యోధుడు ఆనాడు కామ్రేడ్ సోమరాజన్న పై భూస్వామ్య నక్సలైట్ గుండాలు ఐదుసార్లు హత్య ప్రయత్నాలు గావించారు. జైలు జీవితం తప్పుడు కేసులు, నరహంతకు దాడులను ప్రతిఘటన చేస్తూ పార్టీని దేశంలో ఇటు రాష్ట్రంలో పీడిత ప్రజా పక్షవాతిగా పీడిత ప్రజ పక్షపాతిగా నిలబెట్టిన సమరశీల పోరాట యోధుడు కామ్రేడ్ సోమరాజన్న ఎం సిపిఐ (యు )నాయకులు అమరజీవి కామ్రేడ్ గోనే చేరాలు ని 12-12-1985 నాడు పార్టీ లలో అంచలంచలుగా ఎదుగుతున్న యువ నాయకున్ని కక్షగట్టిన కాంగ్రెస్ గుండెలు హత్య చేశారు. అమరజీవి కామ్రేడ్ గోనె చేరాలు జీవిత త్యాగం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని అన్నారు.వారి 39వ వర్ధంతికి ఘన నివాళు లర్పించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలోఎంసీపీ ఐ (యు ) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు తాండ్ర కళావతి, ఇస్లావత్ దశరథ్ నాయక్, కమిటీ సభ్యులు పి భాగ్యమ్మ, ఎం రాణి, తుడుం పుష్పలత, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.

# కళ్ళుండి చూడలేని కబోది కేటీఆర్

**-టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్**

వర్ధన్నపేట,12డిసెంబర్(తరంగాలు):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ఏడాది పాలనలో విజయవంతంగా ముందుకెళుతున్న తరుణంలో ఓర్వలేకనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,రాహుల్ గాంధీకి లేఖ రాశాడని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు.కళ్లుండి చూడలేని కబోది కేటీఆర్ అని ఆయన దుయ్యబట్టారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి రూ.2500 పథకం తప్ప మిగతా 5 గ్యారెంటీలు అమలు కావడం లేదని కేటీఆర్,రాహుల్ గాంధీకి లేఖ ఎలా రాస్తారని సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు.ఈ విషయాన్ని కేటీఆర్ నిరూపించగలరా,ఉచిత బస్సు ప్రయాణంలో 80 కోట్ల మంది మహిళలు లబ్ది పొందలేదని



నిరూపించగలవా,ఉచిత విద్యుత్తు కింద 50 లక్షల మంది గృహిణులు లబ్ది పొందలేని నిరూపించగలవా? కేటీఆర్.. అని ఆయన సవాల్ విసిరారు.అదేవిధంగా 26 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ జరగలేదని చెప్పే దమ్ముందా? రైతు భరోసా కింద రూ.7600 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని చెప్పగలవా కేటీఆర్ అని బండి ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం 14000 కోట్లు ఖర్చు చేస్తే,సీఎం రేవంత్ రెడ్డి 26,800 కోట్లు ఖర్చు చేశారన్నారు. అయినా అబద్దాలతో అందరిని తప్పుదోవ పట్టించడం కేటీఆర్ దొరహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర సంక్షేమం మరిచి,రాద్దాంతం చేస్తున్న కేసీఆర్ ఖబడ్దార్ అని హెచ్చరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల గురించి కేటీఆర్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణాలో ఫిరాయింపులకు పితామహుడే కేసీఆర్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి పట్ల కేటీఆర్ అవహేళనగా మాట్లాడటాన్ని బండి తీవ్రంగా ఖండించారు.కేటీఆర్ భాష మార్చుకపోతే న్యాయపరంగా సివిల్,క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

# ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**-పరకాల ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ రజిని రుద్రమ**

పరకాల,12డిసెంబర్(తరంగాలు):

ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ రజిని రుద్రమ అన్నారు.ఆర్టీసీ పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ రజిని రుద్రమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ తెలిపారు.పరకాల పట్టణంలోని గౌడ సంఘం భవనంలో ఆర్టీసీ పరకాల డిపో బీసీ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా సెక్రటరీ శ్రీలత,గ్యారేజ్ సెక్రటరీ అనిల్ కుమార్,చీఫ్ అడ్వైజర్ బాబురావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు



శివరాత్రి దుర్గయ్య, వరంగల్ రీజినల్ ఎం సాంబయ్య,డిపో ప్రచార కార్యదర్శి వి.వై స్వామి,తదితరుల ఆమోదంతో పరకాల డిపో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ రజిని రుద్రమను ఎన్నుకున్నట్లు తెలిపారు.అనంతరం ఆమెను ఉద్యోగ సంఘ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిని రుద్రమ మాట్లాడుతూ ఆర్టీసీలో బీసీ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో గౌరవ అధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించినందుకు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 363వ రోజు అన్నదానం

వరంగల్, 12డిసెంబర్ (తరంగాలు):



యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన అమెరికాలో నివాసం ఉంటున్న గొట్టిముక్కుల ఆద్య పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు గొట్టిముక్కుల సుజన్ సాగర్- బిందు దంపతులు, తాతయ్య నానమ్మలు గొట్టిముక్కుల నాగసాగర్-తిరుమల దంపతుల సహకారంతో హనుమకొండ ములుగు రోడ్డులోని స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమ వృద్దులకు 363వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గొట్టిముక్కుల సుజన్ సాగర్-బిందు, గొట్టిముక్కుల నాగసాగర్-తిరుమల, గొట్టిముక్కుల ఆద్య,గొట్టిముక్కుల రిశ్విక్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు),కానిస్టేబుల్ బొట్టు కమలాకర్,కోలా రాజేష్,ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువాల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్,ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి,భావన,బిటుకూరి యాకయ్య,పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా,లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్,చెలిమల్ల అశోక్ కుమార్,తూనం రాము,సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్,మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెళ్ళి కార్తిక్,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ లో సత్తా చాటిన ఎంజేపీ ఐనవోలు బాలుర పాఠశాల క్రీడాకారులు





ఐనవోలు,12డిసెంబర్(తరంగాలు):

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలలో ఎంజేపీ ఐనవోలు బాలుర పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. ఐనవోలు మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడల్లో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ సీనియర్స్,ఖో-ఖో సీనియర్స్,వాలీబాల్ అండర్ 18 విభాగాలలో మండలంలోని అన్ని గ్రామాల నుండి దాదాపుగా 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీలలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల క్రీడాకారులు పాల్గొని కబడ్డీ ప్రథమ స్థానం,ఖో -ఖో లో ప్రథమ స్థానం,వాలీబాల్ లో ద్వితీయ స్థానం సాధించారు. ఎంఈఓ ఆనందం,ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,ఎస్సై శ్రీనివాస్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.మహాత్మ జ్యోతిబాపూలే ఐనవోలు బాలుర పాఠశాల పాఠశాల ప్రిన్సిపల్ తిరునగరి శ్రీలత,వ్యాయామ ఉపాధ్యాయుడు సందీప్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.దీనికి గాను మండల స్థాయి సీఎం కప్ నిర్వహించిన మండల అధికారుల అందరికి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ తిరునగరి శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

వర్ధన్నపేట,12 డిసెంబర్(తరంగాలు):



ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. వర్దన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన జెట్టబోయిన వెంకటయ్య తాపీ మేస్త్రి (మత్స్యకారుడు) ఆర్థిక ఇబ్బందులతో సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ఒడిగట్టాడు. దీంతో వారి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందించారు.ఇంకా మెరుగైన చికిత్స అందించడం కోసం వరంగల్ లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు గ్రామస్థులు తెలిపారు.

## నేరాలకు పాల్పడి కుటుంబాలను రోడ్డుపాలు చేయకండి

-సిర్గాపూర్ ఎస్సై వెంకట్ రెడ్డి



నారాయణఖేడ్,డిసెంబర్ 12, (తరంగాలు)

తప్పుడు దారిలో డబ్బులు సంపాదించాలని, జల్సాలకోసం నేరాలకు పాల్పడుతూ జైలుకు వెళ్లి వచ్చిన వారికి సిర్గాపూర్ ఎస్సై వెంకట్ రెడ్డి గురువారం స్థానిక స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు.దొంగతనం కేసులో శిక్ష అనుభవించి బెయిల్ మీద వచ్చిన వాసర్ గ్రామపంచాయతిలోని బిబ్యానాయక్ తాండాకు చెందిన జాదవ్ జయరాం,బలిరామ్, పుండ్లిక్,రాథోడ్ నగేష్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అక్రమదారిలో డబ్బులు సంపాదించి ధనవంతులు కావాలని నేరాలకు పాల్పడి జైలు పాలయినా వారి పిల్లలను,కుటుంబ సభ్యులను సమాజం చిన్నచూపు చూస్తుంది అన్నారు.దొంగ కూతురు,దొంగ భార్య అని ముద్రలు వేసి ఎగతాళి చేస్తారు అన్నారు.నేరాలు చేసి జైలుకు వెళితే భార్య బిడ్డల పరిస్థితి ఏమిటని ఒక్కసారి ఆలోచించాలి అన్నారు.చెడు మార్గాన్ని వీడి ఇక నుంచి మంచిగా బ్రతకాలనీ,ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని,మళ్ళీ ఏదైనా నేరం చేస్తే నమోదు చేయడం జరుగుతుందని,కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయి అన్నారు.

## అయ్యప్ప 18 కలశాల పడి పూజలో పాల్గొన్న సీనియర్ నాయకులు జిల్లా గణేశ్ నేత



శేరిలింగంపల్లి డిసెంబర్ 12, (తరంగాలు)

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ఆటో స్టాండ్ 40 ఫీట్ రోడ్డులో గల వెంకటరమణ గురుస్వామి 18 సంవత్సరాల కలశ పూజలో భాగంగా తన ఇంటి వద్ద పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది , వెంకట రమణ గురుస్వామి ఆహ్వాన మేరకు సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది , ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




హైదరాబాద్ డిసెంబర్ 12, (తరంగాలు)

జనతా నగర్ మూసాపేటలో ఎస్ఎం మోడల్ స్కూల్ మరియు మల్లా రెడ్డి హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం, తెలంగాణ. శిబిరానికి హాజరైన వారికి ఉచిత వైద్యం ఆపరేషన్లు అందిస్తున్న మల్లా రెడ్డి హాస్పిటల్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్నా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ తెలంగాణ వైస్ చైర్మన్ వీఐపీ హ్యూమన్ రైట్స్ అసోషషన్ జాతీయ డైరెక్టర్ అని పిలవబడే ఎండి జహంగీర్ సహాయంతో ఈ కార్యక్రమం సాధ్యమైంది. శిబిరానికి పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఎస్ఎం మోడల్ స్కూల్‌లోని ఇతర సిబ్బంది పాల్గొని వారి ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ మున్నా, సాయి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.

# పట్టా కలిగిన ఇండ్ల లబ్ధిదారునికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి

-రామన్నగూడెం ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు భూ పంపిణీ చేయాలి

-తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా వినతి పత్రం- ఇళ్ల స్థలాలు తక్షణమే పంపిణీ చేయాలని

-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న



డిసెంబర్ 12, (తరంగాలు)నెల్లికుదురు

మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గతంలో నిరుపేదలకు పట్టాలు ఇచ్చిన ప్రతి లబ్ధిదారునికి ఇళ్ల స్థలాలు తక్షణమే కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు గ్రామస్తులతో కలిసి సీపీఐ(ఎం) మండల ఆధ్వర్యంలో కొంత సేపు ధర్నా నిర్వహించి తహసిల్దార్ కుడిచింతల రాజుకు వినతిపత్రాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు తో కలిసి మాట్లాడుతూ.. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గతంలోని 1998వ సంవత్సరం అప్పటి ప్రభుత్వ హాయంలో ఇళ్ల స్థలాలు లేని మీరు పేదల కోసం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేయడం జరిగింది అని అన్నారు. రామన్నగూడెం గ్రామంలో నిరుపేదలను గుర్తించి ఆ రోజుల్లో 60 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వపరంగా పట్టలు ఇచ్చి కాగితాలకే పరిమితం చేసి ఆ భూమిని పంపిణీ చేయడంలో రెవెన్యూ అధికారులు పూర్తి విఫలం చెందారని ఆరోపించినట్లు తెలిపారు. అప్పటినుండి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం అధికార పరిపాలనకు వచ్చిన లబ్ధిదారులను మభ్యపెట్టి వారి వారి పబ్బం గడుపు కోవటం కోసం పాలకులు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చెందారు. గత అనేకసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు తమ గోడును వెళ్ళబోసుకున్న ఆ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి ధోరణి అవలంబించారని తెలిపారు. ఇళ్లస్థలాల భూమి ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి న స్థానిక రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సరైన కాదని అన్నారు. తక్షణమే భూ అక్రమన చేసిన వ్యక్తిని రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలని ఆ భూమిని తాసిల్దారు కార్యాలయం నుంచి పొందిన పట్ట కాగితం కలిగిన ప్రతి ఒక్కరికి పంపిణీ చేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు నాయకులు బాబు గౌడ్ లబ్ధిదారులు నరసయ్య మైస రాములు బండి సోమయ్య సైదమ్మ జయమ్మ ప్రభాకరు పద్మ వెంకటయ్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని అమ్మనీయం



-పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

-అదానీ ముడుపుల వ్యవహారంపై జేపీసీకి పట్టు

-కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ నోటీస్

డిసెంబర్ 12, (తరంగాలు)-న్యూఢిల్లీ

'దేశాన్ని అమ్మనీయం'(దేశ్ బిక్నే నహి దేంగే) అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీల నినాదాలతో పార్లమెంట్ ఆవరణ దద్దరిల్లింది. అదానీ ముడుపుల వ్యవహారంపై చర్చకు పట్టుబడుతూ ఇండియా బ్లాక్ పార్టీలు గురువారం కూడా వినూత్నంగా ఆందోళన చేపట్టాయి. 'దేశ్ బిక్నే నహి దేంగే' అని హిందీలో ఒక్కో అక్షరంతో రాసి ఉన్న ఒక్కో ప్లకార్డు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. సభకు వెళ్లే ప్రధాన గేటు మకర ద్వారం, సంసద్ భవన్ (ఓల్డ్ పార్లమెంట్ భవనం) ముందు ప్రతిపక్ష ఎంపీలంతా మానవహారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు హొరెత్తించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన, డీఎంకే, ఎన్సీపీ, ఆప్, కేరళ కాంగ్రెస్, జేఎంఎం, ఐయూఎంఎల్ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సుముఖంగా లేని కేంద్ర ప్రభుత్వం, ప్రజల దృష్టి మరల్చేలా వ్యవహరిస్తోందని, ఉభయ సభలను ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**-ఉభయ సభలు వాయిదా**

పార్లమెంట్ ఉభయ సభలు గురువారంనాడూ వాయిదాల పర్వం తొక్కాయి. సభలు ప్రారంభమైన క్షణం నుంచి అధికార, ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలతో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తరువాత మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్టు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హొరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తరువాత, జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులున్నట్టు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని స్పీకర్ చైర్‌లో ఉన్న జగదాంబికా పాల్ తెలిపారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ఎంపీ కె.సి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎటువంటి నిబంధన లేకుండానే జీరో అవర్‌లో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ జోక్యం చేసుకుని కాంగ్రెస్ నేతలను విమర్శించారని, వాటిని రికార్డుల్లో ఉంచారని గుర్తు చేశారు. కానీ ప్రతిపక్ష సభ్యురాలు నిబంధన ప్రకారమే మాట్లాడితే, ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. పక్షపాత ధోరణి పనికి రాదని, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. కాంగ్రెస్ నేతలకు, జార్జ్ సోరస్‌కు లింకులు ఉన్నట్లు బీజేపీ నేత నిశికాంత్ దూబే ఆరోపించారు. ఇండియాను నిర్వీర్యం చేసేందుకు సోరస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తున్నదని అన్నారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే తంతు కొనసాగింది. అధికార, ప్రతిపక్షాల ఆందోళనల నడుమ సభ వాయిదా పడింది. తొలుత ప్రారంభమైన సభలో కేంద్ర మంత్రి, సభా నాయకుడు జేపీ నడ్డా మాట్లాడుతూ ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. సభకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని, అందుకు ప్రతిపక్షమే కారణమని

డిసెంబర్ 12, (తరంగాలు)

అన్నారు. నడ్డా మాట్లాడిన తరువాత ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ అవకాశం ఇవ్వకుండా మధ్యాహ్నం 2 గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కూడా గందరగోళం నెలకొనడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

**కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ నోటీస్**

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రతిపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు తాము అనర్హులమన్న ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇచ్చారు. ప్రతిపక్షాలకు చెందిన సుమారు 60 మంది ఎంపీలు సభా హక్కుల తీర్మానానికి మద్దతు తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులను విమర్శించారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్‌పై ప్రతిపక్షాల విమర్శలను ఆయన వ్యతిరేకిం చారు. ఈ సందర్భంగా 'మీరు కుర్చీని గౌరవించలేకపోతే, ఈ సభలో సభ్యులుగా ఉండే హక్కు మీకు లేదు' అని ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి అన్నారు. దీనిపై టీఎంసీ ఎంపీ సాగరికా ఘోష్ స్పందించారు. ప్రతిపక్ష ఎంపీలు రాజ్యసభలో ఉండేందుకు అనర్హులన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇచ్చామన్నారు. ఈ తీర్మానంపై 60 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేసినట్టు ఆమె తెలిపారు. మరోవైపు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభను సజావుగా నడపడానికి కృషి చేయడం లేదని సాగరికా ఘోష్ విమర్శించారు. దీనికి బదులు ప్రతిపక్షాలను పదేపదే అవమానించడాన్ని ఆయన ఎంచుకున్నారని ఆరోపించారు. 'ప్రతిపక్ష సభ్యులను రిజిజు అవమానించారు. పార్లమెంటు లోపల, బయట వ్యక్తిగత పదాలు ఉపయోగించారు. ఆయన ఉన్నత పదవికి ఇది తగనిది. తన పదవిని ఆయన పూర్తిగా దుర్వినియోగం చేయడమే' అని ఆమె అన్నారు.

# బిజినెస్

## జియో న్యూఇయర్ వెల్‌కం ప్లాన్.. దీర్ఘకాలిక యూజర్లకు వెరీ అట్రాక్టివ్..!




గత జూలైలో భారీగా టారిఫ్ చార్జీలు పెంచిన దేశీయ టెలికం సంస్థలు రిలయన్స్, భారతీ ఎయిర్ టెల్.. తాజాగా కస్టమర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా న్యూఇయర్ వెల్‌కం ప్లాన్ తెచ్చింది రిలయన్స్ జియో. కేవలం జియో యూజర్ల కోసం ఎక్స్‌క్లూజివ్ బెనిఫిట్లు కల్పిస్తూ తీసుకొచ్చింది. పార్ట్‌నర్ డిస్కౌంట్స్ తోపాటు ఖర్చు తక్కువతో కనెక్టివిటీ అవకాశం కల్పిస్తోంది. 2025 ప్రారంభం నేపథ్యంలో రూ.2,025 రీచార్జి ప్లాన్ తెచ్చింది. దీర్ఘకాలిక యూజర్లకు ఆకర్షణీయ ప్లాన్ ఇది. నెలవారీగా రూ.349 రీచార్జీ ప్లాన్ కు సమానం కాగా, రూ.468 పొదుపు చేయొచ్చు. ఈ నెల 11 నుంచి జనవరి 11 వరకూ ఈ 'న్యూ ఇయర్ ప్లాన్ వెల్‌కం ప్లాన్' లభ్యం అవుతుందిరూ.2,025 ప్లాన్ కింద నిరంతరాయంగా అన్ లిమిటెడ్ 5జీ సేవల కనెక్టివిటీ ఉంటుంది. ప్రతి రోజూ 2.5 జీబీ డేటా చొప్పున 500 జీబీ (4జీ) డేటా, 200 రోజుల వరకూ అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ పంపుకోవచ్చు. షాపింగ్, డైనింగ్, ప్రయాణ సమయంలో రూ.2150 విలువ గల పార్ట్‌నర్ కూపన్లు లభిస్తాయి. రూ.2500 విలువ గల షాపింగ్ లావాదేవీ నిర్వహిస్తే రూ.500 విలువైన జియో కూపన్, రూ.499 అంతకంటే ఎక్కువ విలువ గల స్విగ్గీ ఆర్డర్ మీద రూ.150 తగ్గింపు, ఈజీ మై ట్రిప్ డాట్ కామ్ ద్వారా విమాన టికెట్ ధర బుక్ చేసుకుంటే రూ.1500 రాయితీ లభిస్తుంది.

# భారత్ మార్కెట్లోకి టయోటా కమ్రీ..
## మైలేజీ ఇలా.. రూ.48 లక్షల నుంచి షురూ..!



ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ తన సెడాన్ మోడల్ కారు కమ్రీ అప్ డేటెడ్ వర్షన్ ను భారత్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.48 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. సేఫ్టీతోపాటు అదనపు ఫీచర్లు, న్యూ ఇంటీరియర్ లే ఔట్, ఆల్ న్యూ డిజైన్లు ఉన్నాయి. గత మోడల్ కమ్రీ కారు కంటే మైలేజీ ఎక్కువ కావడంతోపాటు ధర కూడా 1.83 లక్షలు ఎక్కువ. ఆసక్తిగల కస్టమర్లు తమకు సమీప డీలర్ వద్ద గానీ, టయోటా ఆన్ లైన్ లోగా ప్రీ బుకింగ్స్ నమోదు చేసుకోవాలని సూచించింది. తక్షణం కార్ల డెలివరీ ప్రారంభం కానున్నట్లు టయోటా కిర్లోస్కర్ తెలిపింది. న్యూ టయోటా కమ్రీ 9-జనరేషన్ కారు టీఎన్జీఏ-కే ప్లాట్‌ఫామ్‌పై రూపుదిద్దుకున్నది. లెక్సస్, అల్ ఫార్డ్, స్లెన్నా, వెంజా, లెక్సస్ ఈఎస్, లెక్సస్ ఆర్ఎక్స్ తదితర మోడల్ కార్ల స్ఫూర్తితో డిజైన్ చేశారు టయోటా న్యూ కమ్రీ కారు. ఫిఫ్త్ జనరేషన్ హైబ్రీడ్ సిస్టమ్ (టీహెచ్ఎస్ -5)తోపాటు 2.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 230 హెచ్పీ పవర్ వెలువరించడంతోపాటు లీటర్ పెట్రోల్ మీద 25 కి.మీ మైలేజీ ఇస్తుంది. ఈ-సీవీటీ గేర్ బాక్స్‌తోనూ వస్తుందీ కారు. న్యూ టయోటా కమ్రీ 9-జనరేషన్ కారు ఫ్రంట్‌లో న్యూ హెడ్ ల్యాంప్ డిజైన్ ఇంటిగ్రేటెడ్ విత్ బ్లాక్ ఎలిమెంట్, హానీ కాంబ్ ప్యాటర్న్ గ్రిల్లె, మోర్ స్లోప్డ్ రూఫ్ లైన్స్, రీడిజైన్డ్ టెయిల్ ల్యాంప్స్, రేర్ బంపర్ ఉంటాయి. ఇంటీరియర్‌గా 7.0 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫ్లోటింగ్ 12.3 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, నైన్ స్పీకర్ జేబీఎల్ ఆడియో సిస్టమ్, వెంటిలేటెడ్ సీట్స్, 360 డిగ్రీ కెమెరా, వైర్ లెస్ ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, హెచ్‌యూడీ డిస్ ప్లే, త్రీ జోన్ క్లైమేట్ కంట్రోల్, 10-వే పవర్డ్ ఫ్రంట్ సీట్స్ విత్ హీటెడ్ అండ్ వెంటిలేటెడ్ ఫంక్షన్, ఎలక్ట్రిక్ సన్ రూఫ్ తదితర ఫీచర్లు ఉన్నాయి

# మళ్లీ 80 వేలపైకి పసిడి




బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు అత్యధికంగా కొనుగోళ్లు జరుపుతుండటంతో బంగారం మళ్లీ 80 వేల పైకి చేరుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.620 ఎగబాకి మూడు వారాల గరిష్ఠ స్థాయి రూ.80,400 పలికింది. అంతకుముందు ఇది రూ.79, 780గా ఉన్నది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర 80 వేలకు చేరుకున్నది. బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,450 పెరిగి నెల గరిష్ఠ స్థాయి రూ.96,300కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,700 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా ధరలు పెరుగుతున్నాయని వర్తకులు వెల్లడించారు

# రోహిత్ శర్మను ఓపెనర్‌గా ఆడించే అవకాశం



ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్ ఇరు జట్లకు కీలకమైంది. ఈ సిరీస్‌పై పట్టు బిగించాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు అత్యవసరం. ఈ క్రమంలోనే మూడో టెస్ట్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలను టీమిండియా మేనేజ్‌మెంట్ రెడీ చేస్తోంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్‌గానే ఆడించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. రెండో టెస్ట్‌తో రీ ఎంట్రీ ఇచ్చాడు. కానీ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో రోహిత్‌ను మిడిలార్డ్‌లో ఆడించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ సైతం ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. దాంతో రోహిత్ శర్మను ఓపెనర్‌గానే కొనసాగించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చూస్తే ఈ విషయం అర్థమైంది. ఈ నెట్ సెషన్‌లో రోహిత్ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్నాడు. ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్‌తో పాటు బౌన్సర్లను ప్రాక్టీస్ చేశాడు. స్టంప్ లైన్ డెలివరీలను కూడా ఆడాడు. ప్రస్తుతం రోహిత్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ రెండు సార్లు మాత్రమే 20 ప్లస్ రన్స్ చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉండగా.. 8 సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడితే.. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.

# షమి పునరాగమనంపై అనిశ్చితి



భారత క్రికెట్ జట్టుకు ఒక ముఖ్యమైన సమస్యగా మహ్మద్ షమీ ఫిట్‌నెస్ నిలుస్తోంది. అతని మోకాలి వాపు సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కష్టంగా మారింది. రోహిత్ శర్మ కూడా 100% ఫిట్‌నెస్ హామీ లేకుండా షమిని జట్టులోకి తీసుకోలేనని వెల్లడించారు. అయినప్పటికీ, అతని పునరాగమనంపై నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. 2024లో భారత క్రికెట్ జట్టుకు ఎదురయ్యే అనేక సమస్యల్లో మహ్మద్ షమీ ఫిట్‌నెస్ ఒకటి. భారత జట్టులో పేస్ బౌలింగ్ బలోపేతం అవసరం కావడంతో, షమీ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతం అతని మోకాలి సమస్యలు, ఫిట్‌నెస్ ఆందోళనల కారణంగా అతన్ని త్వరగా ఆస్ట్రేలియాకు పంపడం కుదరట్లేదు. రోహిత్ శర్మ, షమీ గురించి మాట్లాడుతూ, అతనిపై 100% ఫిట్‌నెస్ హామీ ఇచ్చే వరకు జట్టులోకి తీసుకోడానికి ఇష్టపడం లేదని పేర్కొన్నాడు. షమీ పై ఒత్తిడి లేకుండా, మునుపటి ఆట తర్వాత అతను ఎలా తిరిగి పుంజుకుంటాడో, నిపుణులు అతనిని పర్యవేక్షిస్తున్నారని కూడా చెప్పారు. రోహిత్ గమనించినట్లుగా, షమీకి 100% ఫిట్‌నెస్ సాధించాక మాత్రమే జట్టులో చేరే అవకాశం ఉంటుంది. షమీ ప్రస్తుతం బెంగాల్ జట్టు తరపున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడుతున్నాడు, కానీ ఆయన మోకాలి వాపు సమస్యలు కొనసాగుతున్నాయి. షమీ, ఐపీఎల్, రంజీ ట్రోఫీ వంటి పోటీ క్రికెట్‌లో తన నైపుణ్యాలను పునఃప్రదర్శించడానికి ప్రయత్నించినప్పటికీ, మోకాలి సమస్యలు అతని పరిమితులను పెంచుతున్నాయి. ఈ సమస్యల కారణంగా, అతని పునరాగమనంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం ఇంకా అనిశ్చితంగా ఉంది. భారత జట్టు ఇప్పటికే నూతనంగా జట్టులోకి వస్తున్న బౌలర్లతో మ్యాచ్ లు ఆడుతోంది. అయితే షమీ తిరిగి ఫిట్‌నెస్ సాధిస్తే, అతన్ని జట్టులో సమలిసే అవకాశాలు ఉండవచ్చు. కానీ ఈ సమయంలో, అతని స్థితి పునరాలోచన అవసరం.

# స్పోర్ట్స్

## ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా




ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించి 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. దాంతో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఈ నేపథ్యంలోనే గబ్బా వేదికగా జరిగే మూడో టెస్ట్ ఇరు జట్లకు కీలకమైంది. ఈ సిరీస్‌పై పట్టు బిగించాలంటే ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు అత్యవసరం. ఈ క్రమంలోనే మూడో టెస్ట్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలను టీమిండియా మేనేజ్‌మెంట్ రెడీ చేస్తోంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓపెనర్‌గానే ఆడించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ.. రెండో టెస్ట్‌తో రీ ఎంట్రీ ఇచ్చాడు. కానీ ఓపెనర్‌గా కాకుండా మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో రోహిత్‌ను మిడిలార్డ్‌లో ఆడించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు రాహుల్ సైతం ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. దాంతో రోహిత్ శర్మను ఓపెనర్‌గానే కొనసాగించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ చూస్తే ఈ విషయం అర్థమైంది. ఈ నెట్ సెషన్‌లో రోహిత్ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేశాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్నాడు. ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్‌తో పాటు బౌన్సర్లను ప్రాక్టీస్ చేశాడు. స్టంప్ లైన్ డెలివరీలను కూడా ఆడాడు. ప్రస్తుతం రోహిత్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత 12 టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ రెండు సార్లు మాత్రమే 20 ప్లస్ రన్స్ చేశాడు. ఇందులో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉండగా.. 8 సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ ఓపెనర్‌గా ఆడితే.. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.



# 20న ప్రేక్షకుల ముందుకు ఉపేంద్ర

వినూత్న కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర. ఆయన పోషించే పాత్రలు కూడా విలక్షణంగా అనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న పీరియాడిక్ ఫాంటసీ చిత్రం 'యూఐ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. లహరి ఫిల్మ్స్ పతాకంపై జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. యూ/ఏ సర్టిఫికెట్ లభించింది. చాలా విరామం తర్వాత ఉపేంద్ర దర్శకత్వం వస్తున్న ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని మేకర్స్ తెలిపారు. సమకాలీన సమాజంలోని సంఘటనలతో పాటు భవిష్యత్తు భారతంలోని సమస్యలను కథాంశంగా తీసుకొని తనదైన శైలిలో ఉపేంద్ర ఈ సినిమాను తెరకెక్కించారని, కొంతభాగం కథ 2040లో నడుస్తుందని, విజువల్స్ అబ్బురపరుస్తాయని చిత్ర బృందం పేర్కొంది. రీష్మా నానయ్య, మురళీశర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య తదితరులు ఈ చిత్రలో నటించారు.

# భర్తలు అందరూ భార్య చెప్పేది వినండి

## అల్లు అర్జున్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన 'పుష్ప ది రూల్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న విషయం తెలిసిందే. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్‌తో కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఇప్పటికే 6 రోజుల్లో రూ.1000 కోట్ల కలెక్షన్స్ సాధించిన ఈ చిత్రం రూ.1500 కోట్ల దిశగా దూసుకుపోతుంది. ఇదిలావుంటే ఈ సినిమా సాధించిన విజయం పట్ల తాజాగా ముంబైలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది చిత్రబృందం. ఈ వేడుకకు అల్లు అర్జున్‌తో పాటు చిత్రబృందం హాజరయ్యింది.అయితే ఈ వేడుకలో యాంకర్ పుష్పరాజ్‌ని అడుగుతూ.. ఇండియాలో 38 కోట్ల మంది భర్తలు ఉన్నారు. అందరి ఇళ్లలో వారి భార్యలతో గొడవలు జరుగుతుంటాయి. కానీ మీరు మాత్రం భార్య(శ్రీవల్లి) సీఎంతో ఫొటో అడిగిందని ముఖ్యమంత్రినే మార్చేశారు. ఇప్పుడు ఇండియాలో ఉన్న 38 కోట్ల మంది భర్తలను ఏం చేయమంటారు అంటూ యాంకర్ అడుగుతాడు. దీనికి అల్లు అర్జున్ సమాధానమిస్తూ.. భర్తలు అందరూ భార్య చెప్పేది వినండి అంటూ చెప్పుకోచ్చాడు.



# మీడియాకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన సాయిపల్లవి

అగ్ర కథానాయిక సాయి పల్లవి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రేమమ్, ఫిదా, గార్గి సినిమాలతో తనకంటూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా అమరన్ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ.. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమా చేస్తుంది. అయితే సాయి పల్లవి వెజిటేరియన్ అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలా ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ప్రసావించింది. అయితే తాజాగా బాలీవుడ్ రామాయణం సినిమా కోసం సాయి పల్లవి నాన్ వెజ్ మానేస్తుందంటూ తమిళ మీడియా ఒక కథనం ప్రచురించింది. దీంతో ఈ విషయం వివాదం అవ్వగా.. దీనిపై సాయి పల్లవి స్పందిస్తూ.. మీడియాకు వార్నింగ్ ఇచ్చింది. తమిళ అగ్ర మీడియా రామాయణ్ సినిమా గురించి రాస్తూ.. "సాయి పల్లవి ఇప్పుడు బాలీవుడ్‌లో రామాయణం అనే ప్రాజెక్ట్‌లో నటించబోతుంది. దీనికోసం షూటింగ్ ముగిసే వరకు ఎలాంటి నాన్ వెజ్ ముట్టుకోకుడదని తాను నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అలాగే మంసాహారం తినకుండ విదేశాలకు వెళ్లినప్పుడు తనతో పాటు చెఫ్‌ను కూడా వెంట తీసుకువెళుతుంది. ఈ చెఫ్ సాయిపల్లవి కోసం వెజ్ డిన్నర్ తయారు చేస్తారు" అంటూ రాసుకోచ్చింది. అయితే దీనిపై ఘాటుగా స్పందించింది సాయి పల్లవి చాలా సార్లు, దాదాపు ప్రతిసారి.. నా మీద వచ్చే పుకార్లు లేదా తప్పుడు వార్తలను పట్టించుకోను. ఈ విషయం దేవునికి కూడా తెలుసు. ముఖ్యంగా నా సినిమా రిలీజ్‌లు, అనౌన్స్‌మెంట్‌లు వచ్చినప్పుడు ఇలాంటివి ఎక్కువగా వ్యాపిస్తాయి. అయితే ప్రతిసారి ఇలా అవుతుంటే మాత్రం స్పందించక తప్పదు. నెక్స్ట్ టైం ఇలాంటి తప్పుడు వార్తలను అగ్ర మీడియాలు కానీ వాటికి చెందిన సోషల్ మీడియా పేజీలు కానీ ప్రచురిస్తే నా తరపు నుంచి చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అంటూ సాయి పల్లవి రాసుకోచ్చింది.



# వివాహబంధంతో ఒక్కటైన కీర్తిసురేశ్ -ఆంథోని తటిల్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ కీర్తిసురేశ్ –ఆంథోని తటిల్ వివాహబంధంతో ఒక్కటయ్యారు. సౌతిండియా సంప్రదాయ పద్దతిలో కీర్తిసురేశ్ మెడలో మూడు ముళ్లు వేశాడు ఆంథోని తటిల్. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న కీర్తిసురేశ్ దంపతులకు కుటుంబసభ్యులు, ఇండస్ట్రీ ప్రముఖులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వధూవరులిద్దరు మెరిసిపోయారు. కొత్త జీవితాన్ని మొదలుపెడుతున్న క్షణాలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. హ్యాష్‌ట్యాగ్ జత చేసింది కీర్తిసురేశ్. బాలీవుడ్ నటుడు వరుణ్ ధవన్‌తో కలిసి కీర్తిసురేశ్ నటిస్తోన్న బేబిజాన్ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తిసురేశ్‌కు ఇది హిందీలో తొలి సినిమా.



# గండ్రగొడ్డళ్లతో డాకు మహారాజ్..

## బాలకృష్ణ టీం ఫస్ట్ సింగిల్ టైం ఫిక్స్

నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్ . ఎన్‌బీకే 109 గా వస్తోన్న ఈ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పటికే మేకర్స్ యూఎస్‌ఏలో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేశారు.టెక్సాస్‌లోని డల్లాస్‌లో 2025 జనవరి 4న %లో సాయంత్రం 6 గంటల నుంచి ఈవెంట్ జరుగనుంది. కాగా మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ ప్రోమోను రేపు ఉదయం 10:08 గంటలకు లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. హై ఎనర్జిటిక్ మీ ముందుకు రాబోతుందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. బాలకృష్ణ గండ్రగొడ్డుళ్లు పట్టుకొని సమరంలో ఉన్న స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్ పోషిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**